ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
4 డిసెంబర్, 2011

Entered

వాతావ'రణం'

హ్యాపీ బర్త్‌డే

2011

(2011 డిసెంబర్ 4 నుంచి
2011 డిసెంబర్ 10 వరకు)

జి. ఐల
10 సం॥, డిసెంబర్
సుమిత్ర-రమణ
విశాఖపట్నం

ఎ. అభిజ్ఞ
1సం॥, డిసెంబర్-2010
విశాలి-విజయ్‌కుమార్
కంసాన్‌పల్లి-మ॥నగర్

కె.సందీప్
8సం॥, డిసెంబర్-4
మాధవి-బసవయ్య
పిల్లాయిపల్లి-ఖమ్మం

సిహెచ్. సాత్విక
డిసెంబర్
సుహాసిని-విజయ్‌చందర్
టంగుటూరు-ప్రకాశం

పి. గణేష్
2సం॥, డిసెంబర్-2009
తులసి-మోహన్‌రెడ్డి
రైల్వేకాలనీ-విశాఖ

డి. సిద్దార్థ్(పండు)
డిసెంబర్-2007
సంతోష-గణేష్
పెద్దతూండ్ల-రంగారెడ్డి

డి. స్వీటి
డిసెంబర్-2009
సంతోష-గణేష్
పెద్దతూండ్ల-రంగారెడ్డి

ఎన్. వర్ష(డింపు)
4సం॥, డిసెంబర్-6
శోభ-విజయ్‌కుమార్
అస్మత్‌పూర్-రంగారెడ్డి

ఎ.శ్రేణిక్
3సం॥, డిసెంబర్-7
జ్యోతి-రవి
బి.హెచ్.ఇ.ఎల్

శ్రీవర్షిత(జెస్సీ)
డిసెంబర్-5
జ్యోతి-గురవయ్య
వెంకటయ్యపాలెం-ఖమ్మం

అపర్ణజ్యోతి
2సం॥,
డిసెంబర్-2009
నిర్మల-శాంతప్ప

కె. దీక్షిత
6సం॥, డిసెంబర్-8
ఇందిర-సుధీర్
తాటిపాముల-నల్లగొండ

సంజయ్-ప్రణయ్
డిసెంబర్-9
సుచరిత-నాగేష్
నల్లగొండ

జె. పునీత్
4సం॥, డిసెంబర్-2007
పద్మ-మోహన్
సైదాబాద్-హైదరాబాద్

ఆర్. హర్షిత-హన్సిక
డిసెంబర్
శ్రీలక్ష్మి-సైదులు
రాంనగర్-హైదరాబాద్

టి. శర్వాణి(స్మైలీ)
4సం॥, డిసెంబర్-7
లక్ష్మిఅనురాధ-మురళీమోహన్
నంద్యాల-కర్నూలు

కె. అక్షర
2సం॥, డిసెంబర్-3
సుజాత-విజయ్‌కుమార్
గణేష్‌నగర్-ఉప్పల్

ఎస్. వర్ష
5సం॥, డిసెంబర్-5
సౌజన్య-బద్రీనాథ్
కొలమసానపల్లి-చిత్తూరు

సాయి చరణ్
డిసెంబర్
ప్రేమలత-మల్లేష్
మేడిపల్లి-రంగారెడ్డి

కె. అంబిక
2సం॥, డిసెంబర్-2009
హైమావతి-సూర్యనారాయణ
చిట్టినగర్-విజయవాడ

మనలో మాట

గుండెల్లో చలి



పట్టు వదలని విక్రమార్కుడు ఎప్పటివలె చెట్టు వద్దకు వెళ్లి, బేతాళుడిని భుజాన వేసుకొని శ్మశానం వైపు నడక ప్రారంభించాడు.

"రాజా...., ఇంత చలిలోనూ నువ్వు పడుతున్న ప్రయాస చూసి, నాకు నవ్వొస్తోంది. జాలేస్తోంది. ఏ ప్రయోజనం ఆశించి నువ్వు ఇంత యాష్ట పడుతున్నావో అర్థం కాకుండా ఉంది. సరే.... నీకు చలిబాధ తెలియకుండా కొన్ని ప్రశ్నలు అడుగుతాను. చకచకా సమాధానాలు చెప్పు" అన్నాడు బేతాళుడు.

"దీన్లో కొత్తేముంది లే.. కుర్చీ రాజకీయాల్లో కప్పదాట్లు లాగా, అధికార పక్షం హామీల్లాగా- ఎప్పుడూ ఉండేది కదా... అడుక్కో..' అన్నాడు విక్రమార్కుడు.

"అదిగో... ఆ తలపొగరే పోయింది కాదు నీకు. ఇలా ముందు పెద్దపులిలా గాండ్రించి... తరువాత పిల్లికూనలా మారిపోయిన, మారిపోతున్న నాయకులు ఎంతోమంది తెలుసు నాకు... నువ్వూ అదే కోవలోకి చేరిపోతావేమోనని అనిపిస్తోంది... సరే.... లోకహితం కోసం కొన్ని ప్రశ్నలు అడుగుతాను. తగు సమాధానాలూ, పరిష్కారాలూ చెప్పు"

"రాష్ట్రంలో చలి విజృంభిస్తుంటే- చాలాచోట్ల జనం గజగజా వణికిపోతున్నారు. దాని బారి నుంచి వారిని కాపాడే దారే లేదా?"

"ఎందుకు లేదు బేతాళా? అడగటం కోసం అడుగుతున్నావు కానీ, నీకు తెలీని సంగతా ఇది! నెగళ్లు రగిలించి, మంట కాగవచ్చు. రగ్గులు కప్పుకొని చలిని నిరోధించవచ్చు... స్వెటర్లు తొడుక్కొని హాయిగా ఉండొచ్చు. గ్లౌజులు వేసుకొని చేతులను రక్షించుకోవొచ్చు. ఆర్థిక స్థాయిని బట్టి- కుంపట్లు, హీటర్లూ .... ఉపయోగించవచ్చు. సాయంత్రం వేళ ... శీతగాలులు ప్రారంభం కాగానే- తలుపులు బిగించవచ్చు. కిటికీలు బిడాయించవచ్చు... పిల్లాపాపలూ హాయిగా గడపవచ్చు..."

"భేష్ రాజా... లెస్సగా చెప్పావు. జరుగుబాటు ఉంటే- అలా హాయిగానే ఉండొచ్చు మరి! సరే... సంక్షేమ హాస్టళ్లలో చలికి వణికిపోతున్న విద్యార్థులకు ఏమిటి పరిష్కారం?"

"దుప్పట్లూ రగ్గులూ ఇవ్వకుండా మంత్రులను, అధికార పార్టీ నాయకులను ఒక్కరోజు హాస్టలు నిద్ర చేయిస్తే సరిపోతుంది.."

"సరి సరే... బయటినుంచి వీస్తున్న చలిగాలులను తట్టుకోవటానికి మంచి తరుణోపాయాలు చెప్పావు. అదే స్పీడులో ఈ సమస్యలకూ పరిష్కారం చూపించు. అమెరికాలో నిరుద్యోగం పెచ్చు పెరిగి ఒబామాను వణికిస్తోంది. అతడి సంగతేంటి? వాల్ స్ట్రీట్ ముట్టడిలో పాల్గొనే వారికంటే అక్కడి పాలకులే ఎక్కువ వణుకుతున్నారు. వారి గతేమిటి? ఘనత వహించిన ఇంగ్లండుతో సహా యూరపు దేశాలన్నీ అక్కడి ప్రజల నిరసనాగ్రహాలతో రగిలిపోతుండగా ప్రభుత్వాలు వణికిపోతున్నాయి. వాటి సంగతేంటి? రాష్ట్రంలో సాగుతున్న సిబిఐ విచారణ చాలామంది 'పెద్దలకు' వెన్నులో వణుకు పుట్టిస్తోంది. వాళ్లకు చలి దడ తగ్గే దారేమైనా ఉందా?"

ఆలోచనలో పడ్డాడు విక్రమార్కుడు.

ఓ నవ్వు రువ్వుకుంటూ తిరిగి చెట్టెక్కాడు బేతాళుడు ...!

✶

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	4
ఈ పేజ్	...	10
కొత్తపుస్తకాలు	...	11
ఎవరి గోల వారిదే	...	12
అట్టమీది కథ	...	14
వికాసం	...	20
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

ప్రత్యేకం 6
క్లుప్తత... స్పష్టత 'దిద్దుబాటు'

కథ ... 8
జగడ

సినిమా కబుర్లు ... 13
'కొలావరి' కోలాహలం

తెలుసుకుందామా ... 18
నేచర్ ఈజ్ ది టీచర్



అట్టమీది కథ

'ఎవరి గోల వారిదే' బాగుంది. పెట్రోలును మోటారు వాహనాలు, యంత్రాలకు మాత్రమే వాడతారు. కానీ నీళ్లు అన్నింటికీ ఉపయోగమే. భారతదేశంలో నీటి వనరులెన్నో ఉన్నాయి. కానీ తాగడానికి ఫిల్టర్ వాటర్ కొనుక్కోవాల్సి వస్తోంది. గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' కథ బాగుంది. ఆయన మానవాళికి ఒక దిక్సూచి. వందేళ్ల క్రితమే కాదు, వెయ్యేళ్ల తర్వాతైనా 'దిద్దుబాటు' కథ సజీవంగా ఉంటుంది. పూర్వం భార్య అలిగి పుట్టింటికి వెళ్తే, భర్త తన లోపాన్ని సరిదిద్దుకునేవాడు. ఇప్పుడు కాపురంలో దిద్దుబాటు కోసం కోర్టులు, పోలీస్‌స్టేషన్లు... అవసరమవుతున్నాయి. ఇటువంటి కథలు చదివైనా నేటి తరం ఆలోచనలు మారాలి. సాహసిస్తే ఎన్ని ఎదురు దెబ్బలు తగులుతాయో అనుభవమున్నవాళ్లు చెబుతారు. ఒక ముఖ్యమంత్రిపై సవాల్ విసిరి అఫిడవిట్ దాఖలు చేయడం సామాన్యమైన విషయం కాదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేసు వేసి కష్టాలు పడినా తిరిగి అధికారంలోకి రావడం గర్వించదగింది. అతనికి అన్నివిధాలుగా అండదండలు అవసరం. అలాగే సంజీవ్ భట్ రాసిన కవిత బాగుంది. 'అట్టమీది కథ' ద్వారా ఆయనకు సంబంధించి చాలా విషయాలు తెలిశాయి. ఈ వారం 'వికాసం' కల్తీ కబుర్లు చదివాక కాదేదీ కల్తీకనర్హం అనిపించింది.

బొడ్డేపల్లి కనకలక్ష్మి,
ఆముదాలవలస.

కోటికొక్కరు

ఈ వారం 'మనలో మాట'లో అమెరికాను గురించి 'ఇనుప రెక్కల డేగ' అంటూ చక్కని మాట చెప్పారు. కోటి రూపాయలు వద్దన్న కర్కారే నిజంగా మెచ్చుకోదగిన మనిషి. గంధం పిట్ట కబుర్లు బాగున్నాయి. 'ఈ పేజ్'లో ఈ లెర్నింగ్ విషయాల గురించి తెలుసుకున్నాం. వేలు బొమ్మలు బాగున్నాయి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

చక్కటి వ్యాసాలు

స్నేహ సంచిక బాగుంటోంది. ప్రత్యేకంగా 'వికాసం' శీర్షిక లోని వ్యాసాలు ప్రతి వ్యక్తి జీవితంలో ఉపయోగపడేవి, ఆచరించదగినవి. సర్వేశ్వర శర్మకు అభినందనలు.

పి. ప్రభాకరరావు, హైదరాబాద్.

ఎన్ని తరాలైనా...

మహాకవి గురజాడ 'దిద్దుబాటు' కథ అలరించింది. భర్తకు భార్య బుద్ధి చెప్పి సన్మార్గం వైపుకు తిప్పే ఈ కథ తరతరాలకు మేలు చేస్తుంది. ఈ కథలో మాటలు ఆణిముత్యాలు. సాహిత్య అభిమానులకు కనువిందు.

నూతి నారాయణరావు, గడ్డిఅన్నారం.

హాస్య గుళికలు

అట్టమీది కథ 'సాహసమే సాక్షిగా' రచన ఆసక్తిదాయకంగా ఉంది. డా॥ఎం.కోటేశ్వరరావు 'మూగరోదన' బాగుంది. మూగ జీవాల హృదయ ఘోష జీవకారుణ్య ప్రాధాన్యతను తెలియజేసింది. కల్తీలు ఎన్ని రకాలుగా చేస్తారో, వాటి వల్ల ఏ వ్యాధులు వస్తాయో 'వికాసం' ద్వారా తెలుసుకున్నాం. 'బాల నేస్తాలు'లో గంధం పిట్ట విషయాలు తెలిశాయి. వేలు బొమ్మలు గమ్మత్తుగా ఉన్నాయి. చిన్నప్పుడు ప్రతి ఒక్కరూ వేలిమీద పెన్నుతో బొమ్మలు వేసుకుని ఆటలాడినవారే. 'కవిత్వం' పేజీ ఆసాంతం అలరించింది. గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' కథ ఈ తరం వారికి పరిచయం చేశారు. చాలా ఆనందంగా ఉంది. 'ఈ పేజ్, ఈ న్యూస్ ఉపయుక్తంగా ఉంటున్నాయి. 'మాటల కోట' పద సంపద పెంచుకోడానికి ఉపయోగంగా ఉంది. 'నవ్వుల్ పువ్వుల్' హాస్య గుళికలను అందించింది. 'ఎవరిగోల వారిదే' నేటి వాస్తవ ప్రపంచ పోకడలను కళ్ల ముందుంచుతోంది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.

ఇలాంటివి మరెన్నో...

'మనలో మాట'లో ఇనుప రెక్కల డేగ గురించి చక్కగా వివరించారు. అట్టమీది కథ 'సాహసమే సాక్షిగా...'లో సంజీవ్ భట్ నరేంద్రమోడీకి ఎదురు నిలిచిన తీరు బాగుంది. ప్రస్తుత సమాజంలో స్త్రీ ఎన్ని రకాల ఇబ్బందులు పడుతోందో 'భీతావహం' కవిత ద్వారా ఎస్.వివేకానంద తెలియజేశారు. 'బాల నేస్తాలు'లో



మూడు ప్రాణులు ఒకే పక్షిలో ఉండడం గమ్మత్తుగా అనిపించింది. గంధం పిట్ట విశేషాలు బాగున్నాయి. 'దిద్దుబాటు' కథ ద్వారా గురజాడని మరోసారి స్మరించుకున్నాం. చివరిపేజీలో చేతివేళ్ల బొమ్మలు బాగున్నాయి. పిల్లలకి ఈ బొమ్మలు ఎంతగానో నచ్చాయి. చిన్నారులకు ఇలాంటివి మరెన్నో అందించాలని కోరుతున్నాం.

అనుపోజు సంతోషినాగరాజు,
విజయనగరం.

అమూల్యం

'పాత కథ' దిద్దుబాటు చాలా ఉపయుక్తంగా ఉంది. ప్రతి తెలుగు సాహిత్యాభిమాని తప్పక చదవాల్సిన కథ. ఇలాంటి రచనలు చేయడం అందరికీ సాధ్యపడదు. ఈ కథను జిరాక్స్ తీయించి మా కళాశాల విద్యార్థులందరిచేతా చదివించాం. తక్కువ మూల్యానికి అమూల్యమైన రచనను సొంతం చేసుకునే వీలు కలిగించారు. ఇలా ఆ పాత మధుర సాహిత్యాంశాలను స్నేహ పాఠకుల కోసం అందిస్తారని ఆశిస్తున్నాం.

అమ్మిన శ్రీనివాసరాజు,
చర్ల, ఖమ్మం.





కావలసిన పదార్థాలు

పెద్ద ఉసిరికాయలు - 4

అన్నం - 200 గ్రా

పసుపు - పావు టీ స్పూన్

పచ్చిమిర్చి - 4

పోపు సామాను - 2 టేబుల్ స్పూన్లు

నూనె - 3 టీ స్పూన్లు

తయారు చేసే పద్ధతి

ఉసిరికాయలు తురుముకోవాలి. అన్నం వండి ఆరబెట్టుకోవాలి. దానికి పసుపు, ఉప్పు, ఉసిరి తురుము కలపాలి. పోపు సామాను, పచ్చిమిర్చి ముక్కలతో తాలింపు పెట్టుకుని పసుపు, ఉసిరి తురుము కలిపిన అన్నానికి కలపాలి.

ఉసిరి పులిహోర

కావలసిన పదార్థాలు

ఉసిరి కాయలు - 1 కప్పు

పంచదార - 1 కప్పు

తయారు చేసే విధానం

ఉసిరికాయలు కడిగి కుక్కర్‌లో పెట్టాలి. మూడు విజిల్స్ వచ్చాక తీయాలి. చల్లారాక అందులోని గింజలు తీయాలి. పంచదార, ఉడకపెట్టిన ఉసిరి ముక్కలు కలిపి దగ్గరా అయ్యేవరకు సన్నసెగ మీద తిప్పుతుండాలి. ఇది బ్రెడ్, చపాతీలోకి బావుంటుంది.

ఉసిరి జామ్

కావలసిన పదార్థాలు

తినే ఉసిరికాయలు (చిన్న ఉసిరి) - 1 డబ్బా

పంచదార - 1 డబ్బా

యాలకుల పొడి - పావు టీ స్పూను

తయారు చేసే పద్ధతి

కాయలు శుభ్రంగా కడిగి, వాటికి పంచదార కలిపి కొద్దిగా నీళ్ల చల్లి సన్న సెగమీద ఉడికించాలి. పాకం దగ్గరగా వచ్చేవరకు ఉడికించి దించేముందు యాలకుల పొడి కలపాలి. ఇది వేడిగా/ చల్లగా ఎలా అయినా రుచిగా ఉంటుంది.

ఉసిరి పాకం













ఆమ్లా మురబ్బా

కావలసిన పదార్థాలు

పెద్ద ఉసిరి కాయలు - 1 కేజీ

పంచదార - ఒకటింబావు కేజీ

తయారు చేసే విధానం

ఫోర్కుతో కాయలని గుచ్చి, అవి మునిగేదాక నీళ్ల పోసి కొద్దిసేపు ఉంచాలి. తర్వాత కాయలని కడగాలి. మళ్లీ వాటిని మరిగే నీళ్లలో వేసి రెండు నిమిషాలు ఉడకనిచ్చి దించేయాలి. పంచదార పాకం పట్టి ఉడికించిన ఉసిరికాయల్ని పాకంలో వెయ్యాలి. వీటిని ఒక రోజు అలాగే ఉంచాలి. తర్వాత కాయల్ని తీసి పొడిగా ఉన్న సీసాలో వేసి మూత పెట్టాలి. ఇవి మూడు నెలలు నిల్వ వుంటాయి.

ఉసిరి వక్కపొడి

కావలసిన పదార్థాలు

రాచ ఉసిరికాయలు - 1 కిలో

ఉప్పు - తగినంత

జీలకర్ర పొడి - 1 టేబుల్ స్పూన్

తయారు చేసే విధానం

ఉసిరికాయలు తొనలు తీసి చిన్న ముక్కలు కోసుకోవాలి. ఈ ముక్కలకి జీలకర్ర పొడి, ఉప్పు కలిపి ఒకరోజు ఉంచాలి. మరుసటి రోజు ఎండలో పెట్టాలి. ఇలా నాలుగైదు రోజులు బాగా ఎండనివ్వాలి. వాటిని పొడి డబ్బాలో వేసుకోవచ్చు. చాలా రోజులు నిల్వ ఉంటాయి. భోజనం తర్వాత తింటే చాలా బావుంటుంది. జీర్ణశక్తి పెరుగుతుంది.

ఉసిరి ముక్కలు

కావలసిన పదార్థాలు

పెద్ద(రాచ)ఉసిరికాయలు - 10

పచ్చిమిర్చి - 5

పసుపు - 1 టీ స్పూన్

ఉప్పు - తగినంత

నీళ్లు - 2 గ్లాసులు

తయారు చేసే విధానం

ఉసిరికాయలు తొనలుగా కోసుకోవాలి. పచ్చిమిర్చి సన్నగా తరగాలి. నీళ్ల మరగబెట్టి చల్లార్చుకోవాలి. ఈ నీళ్లల్లో ఉసిరి ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు, ఉప్పు కలిపి మూడు రోజులు అలాగే ఉంచుకోవాలి. ఇవి వారం, పది రోజులు నిల్వ ఉంటాయి. ఈ ముక్కలను రోజూ తింటే శరీరానికి కావలసిన సి విటమిన్ అందుతుంది.

జయ కేతనం

నింగినంటిన భీకర మహారణ్యం
ఎలాగైనా నిశీథిలో దాటాలి
పగటికంటే రాత్రి గాఢమైంది
రాత్రికంటే చీకటి సాంద్రమైంది
క్రూరమృగాల గర్జింపులు గాండ్రింపులు
జంతువుల ఘీంకారాలు సకిలింపులు
విషసర్పాల బుసబుసలు
పడుగు పేకల్లా తీగలు
నడకకు దారులు లేవు
తూర్పు పడమరలు లేవు
గడ్డకట్టిన చీకటిపై
వెన్నెలదారి నిర్మించాలి!
"జయం భయాన్ని ఓడిస్తుంది"
నాన్న సందేశం ఎంత ప్రేరణ
కొమ్మలు రెమ్మలు
ఎన్ని వెలుగులకు స్వాగతం పలికాయి
ఎన్ని చీకట్లకు
వీడ్కోలు చెప్పాయి
ఎన్ని మొదళ్లు మృగాల
హింసలు వీక్షించాయి
ఎన్ని గుబుర్లు జంతువులకు
ఆశ్రయం కల్పించాయి!
"బిగించిన పిడికిలి
ఐదువేళ్ల శక్తి సంచయం"
అమ్మ నిర్వచనం అద్భుతం
గాలితో వూసులాడుతూ ఆకులు
నా పాట నాకే వొప్పజెప్తూ ప్రతిధ్వనులు
పాదాలకు తివాసీలు పరుస్తూ గడ్డి
గూళ్లలో తొంగి చూస్తూ చుక్కలు
దారులు వేస్తూ సాగిన దీక్ష
అడవిదాటి దిక్కులు చూసింది
ప్రతినను చూసి జయం నవ్వింది
విజయం వెనుక అమ్మానాన్నలు!

- అడిగోపుల వెంకటరత్నమ్

కవుల కలాలు

తలలు పుచ్చిన మనుషుల
ఛాందసభావ విషవృక్షాలను
వేళ్లతో సహా కూల్చిపారేసే
భయంకర భూకంపాలను
సృష్టించేవే కవుల కలాలు!
వరకట్న పిశాచాన్నైనా
మద్యం మహమ్మారినైనా
దేన్నైనా... ఎలాంటిదైనా
పట్టుబట్టి చుట్టచుట్టి
కట్టగట్టి బంగాళాఖాతంలో
విసిరిపారేసే వైవిధ్యపు
శక్తి సమన్వితాస్త్రాలే
కనుగొన మన కవుల కలాలు!
అందాలను సృష్టించేవీ
అద్భుతాలు చూపెట్టేవీ
అమృత భాండాలందించేవీ
చేతనాట్యమాడేవీ
చైతన్య దీప్తులొసగేవీ
కనుగొన మన కవుల కలాలు!

- కొడుకుల సూర్య సుబ్రహ్మణ్యం

ఓ విరామం తర్వాత

ప్లాస్టిక్ పూల తోటలో
లాఫింగ్ గ్యాస్ సీసా సర్దుకుని
ఓ విరామం తర్వాత
సూర్యోదయాన్ని వెంట బెట్టుకుని
హడావుడిగా దిగిపోక తప్పదు కదా?
హైటెక్కు జనారణ్యంలో
సందర్భోచిత మాస్కుల్ని
సంచీలో కుక్కుకుని
ఓ అంకం తర్వాత
శూన్య హస్తాల్తో, శుష్క ప్రణాళికల్తో
వేదిక నెక్కక తప్పదు కదా!
కాంక్రీటు పర్ణశాలలో
కాసిని కరచాలనాల్ని పిడికిట్లో దాచుకుని
ఓ ఆటవిడుపు తర్వాత
కాలం గాయాల్ని మోస్తూ
పరుగులెత్తక తప్పదు కదా!
కనిపించని పంజరంలో
విరిగిన రెక్కల్ని చూసుకుని
ఓ నిశ్శబ్దం తర్వాత
పంటి బిగువు పలకరింతల్తో
లేని ఐక్యతల్ని చాటుకోక తప్పదు కదా!
ఏముందిక!
ఓ విరామం తర్వాత
నియంత్రిత పరిభ్రమణానికై
గానుగెద్దు మళ్లీ
నిర్లిప్తంగా కాడెత్తుకుంటుంది
లేకుంటే... నాటకం నడిచేదెలా?
ఈ గంట గడిచేదెలా?!
(బదులు తెలిసాక...)

- కొండెపోగు బి.డేవిడ్ లివింగ్ స్టన్

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

కూపన్ పంపండి లేదా SMS పంపండి.

CHENNAI: 0-97890 99589

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం. ఊరిపేరు, ఫోన్ నెం., పిన్‌కోడ్‌లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. మా సెల్‌ఫోన్ 24 గంటలూ కంప్యూటర్‌కు లింక్ చేయబడి ఉంటుంది. మీ అడ్రసు ఆటోమేటిక్‌గా కంప్యూటర్ రిసీవ్ చేసుకుంటుందని తెలుసుకోగలరు. కోర్సు ఫీజు రూ.1000/-లు. ఇది 5 నెలల కోర్స్. రోజూ ఒక గంట చదివితే చాలు. ఈ కోర్సులో 10 పుస్తకాలు, 1 CD ఉంటాయి. మీకు ఏమయినా సందేహాలు ఉంటే, లెటరు వ్రాసి తెలుసుకోవచ్చు. 10 రోజులలో పోస్ట్‌మేన్ కోర్స్ ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి కోర్స్ మెటీరియల్ పొందవచ్చును. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE ™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

.... Pin Code: [ ]

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**93915 49930. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

ప్రత్యేకం

క్లుప్తత... స్పష్టత 'దిద్దుబాటు'

గురజాడ 150వ జయంతోత్సవాల సందర్భంగా ప్రతి వారం గురజాడ శీర్షికని ప్రచురించాలనుకోవడం మంచి నిర్ణయం. మీరు మొదటిగా ప్రచురించిన 'దిద్దుబాటు' కథ గురజాడ మొదట రాసింది. ఆ తర్వాత గురజాడ తమని తామే దిద్దుబాటు చేసుకుని ఈ గ్రాంథిక భాషాకథని వ్యవహారిక భాషలోకి తిరగ రాశారు. 1910లో వ్యవహారిక భాషోద్యమాన్ని తీవ్రతరం చేయడానికి గురజాడ వ్యవహారిక భాషలో రచనల్ని చేశారు. ఆ సందర్భంలో ఈ కథని, వ్యవహారిక భాషలోకి తిరగ రాసి 'తలుపు... తలుపు' అంటూ ప్రారంభించి ఆధునిక కథ తలుపులు తెరిచారు.

మనం మాట్లాడుకునే భాషలో మన చుట్టూ ఉన్న పాత్రల్ని, సంఘటనల్నీ వుస్తువుగా చేసుకుని ప్రత్యేక శిల్పంతో వచ్చే ప్రక్రియలు ఆధునిక ప్రక్రియలు. 1848 వరకు తెలుగు కథ ఆకాశంలో సంచరించింది. మనకి కనిపించని దేవతల ద్వారా విలువల్ని, నీతుల్ని బోధించింది. క్రమంగా 1848లో హితవాది పత్రికలో ఎడ్మండ్ షార్కె అనువదించి, ప్రచురించడంతో కథ నేలకి దిగింది. ఆ తర్వాత భాషని మార్చుకోడానికి దాదాపు 62 ఏళ్లు పట్టింది. ఈ సాహిత్య పరిణామంలో ఎందరి కృషో ఉంది. వారందరికీ పేరు పేరునా నమస్కారాలు. ఈ పరిణామాన్ని పూర్తిగా సాధించడానికి కారకులైన గురజాడ వారికి శతకోటి నమస్కారాలు.

గురజాడ చేతిలో కథ భాషని మార్చుకున్న పరిణామం ఈ రెండు కథలతో పూర్తిగా మనకర్థమైపోయింది. అంతకు ముందు వచ్చిన కథలకు భిన్నమైన శిల్పం, క్లుప్తత, స్పష్టత కూడా మనకి 'దిద్దుబాటు'లో కనిపిస్తుంది.

ఆధునిక కథ – కథానిక లక్షణాలివని గురజాడ చెప్పకపోయినా 'దిద్దుబాటు' చదివితే వాటి లక్షణాలివని స్పష్టంగా మనకర్థమవుతుంది. కథానికలో ఉపోద్ఘాతాలు, వర్ణనలు లేకుండా సరాసరి కథలోకి వెళ్లాలి. కథానిక 'తలుపు... తలుపు...' అంటూ ప్రారంభమవుతుంది. ఏకాంశంలోనే ఏకకాలంలో నడుస్తుంది. చివరలో ఊహించని ముగింపు. అంత వరకూ కథ, కమలిని పాత్ర చుట్టూ తిరుగుతున్నా ఆఖరులో గాని కమలిని రాదు.

అప్పటి సమస్య వేశ్యాలోలత్వం. వేశ్యాలోలుడైన భర్తని దిద్దుబాటు చేసుకోవాలనే ఉద్దేశంతో ఇంట్లోనే మంచం కింద దాక్కుని, భర్త బుద్ధొచ్చిందని చెంపలు వేసుకున్న తర్వాత కిలకిలమని నవ్వుతూ మంచం కిందనుండి రావడంతో కథ ముగుస్తుంది.

భర్త వేశ్యాలోలుడయ్యాడని భార్య, అతడితో తగవులకు దిగదు. పుట్టింటికి పారిపోదు. గడప దాటకుండానే ఇంట్లో ఉండి తప్పయిపోయిందని భర్త చెంపలు వేసుకునేట్లు చేస్తుంది. మరి కమలిని అబలా? సబలా?

వివాహ బంధం మీద గురజాడకి గౌరవముంది. వారు విడాకులు తీసుకుని వేరు వేరు కాపురాలు పెట్టాలని రచయిత ఆశించలేదు. తప్పుని దిద్దుబాటు చేసుకుని సంసారం సాగించాలని ఆశించారు. చదువుకున్న స్త్రీ తన సంసారాన్ని చక్కదిద్దుకోగలదని ఆయన అభిప్రాయం.

సాహిత్యం పరమావధి చెడుని ఎండబెట్టడం. మంచికి ప్రోత్సాహమందించడమని గురజాడ అభిప్రాయం. అందుకే భార్య పుట్టింటికి వెళ్లిందేమోనని భయపడుతున్న పంతులుతో నౌకరు రాముడు 'ఆడోరిని అందుకే పెద్ద చదువులు చదివించకూడదనే' అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తే, అంత బాధలోనూ 'చదువుకున్న స్త్రీ జాతి రత్నంరా" అంటాడు పంతులు. నౌకరు పాత్ర ద్వారా పాత్రోచిత మాండలికాన్ని ప్రవేశపెట్టారు గురజాడ.

ఈ కథ క్లుప్తంగా మూడు పుటల్లో ముగుస్తుంది. విషయాన్ని స్పష్టంగా మన ముందుంచుతుంది. ఒక్క వాక్యం అనవసరంగా ఉండదు. అనవసరపు పాత్రలూ లేవు. ఇవన్నీ మనం కథానికకు చెప్పుకుంటున్న లక్షణాలేగా?

- డా॥ వేదగిరి రాంబాబు

మీ ఇంట్లోనే పవర్‌ఫుల్ స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్

ఇంగ్లీష్ కోర్స్ రూ.600/- లకే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1
డివిజన్-2
డివిజన్-3
\+ అడిషనల్ బుక్స్. ఒక డైరీ. ఒక ఆడియో సి.డి. మరియు కోర్స్‌కు ఉపయోగపడే 4 ఇన్ 1 గిఫ్ట్ బుక్స్ (పాకెట్ సైజులో)

ఇవన్నీ రూ.600/-లు

డివిజన్-1 Basic నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది.

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది.

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది.

పూర్తి డబ్బు వాపస్ మనస్ఫూర్తిగా మీకీ కోర్సు నచ్చలేదని అనిపిస్తే, కోర్సు పుస్తకాలు 15 రోజుల్లోపల మాకు తిప్పి పంపండి. మీ డబ్బుని (కేవలం పోస్టు ఖర్చులు మాత్రం మినహాయించి) మీకు ఎమ్.ఓ.చేస్తాం. గిఫ్ట్ పుస్తకాల సైజు 9 cm X 11 cm లోనూ, కోర్సు మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ ఉంటాయి. డైరీ సైజు 12 cm X 17.5 cm లోనూ (ఆఫ్‌సెట్ మల్టీకలర్ కవర్‌తో) ఉంటాయి. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ సంవత్సరానికి క్రొత్త డైరీగా ఉపయోగించుకునే విధంగా ప్రత్యేకంగా రూపొందించబడిన డైరీ.

కూపన్ పంపండి లేదా SMS పంపండి.

Phone: 0-99405 70931

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పేరు, ఇంటి నెం. ఊరిపేరు, పిన్‌కోడ్, ఫోన్ నెం.లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. పై ఫోన్ నెంబరు 24 గంటలూ కంప్యూటర్‌కు కనెక్ట్ చేయబడి ఉంటుంది. మీరు పంపే ఎస్.ఎమ్.ఎస్. అడ్రసు ఫోన్ నుండి కంప్యూటర్‌కు వెళ్తుంది. మీ అడ్రసు ప్రకారం మేము కోర్సు మెటీరియల్ పంపుతాము. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

కొత్త సంవత్సర కానుక



STUDENTS' ENGLISH INSTITUTE

Post Bag No. 8569,
No. 17/A, Chari Street, T. Nagar, Chennai - 600 017.

నాకు కోర్సు మెటీరియల్ పంపండి. పోస్ట్‌మేన్‌కి మొత్తం రూ.600/-లు చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ....

Address: ....

....

....

....

.... Pincode [| | | | |]

కొన్ని లక్షలాదిమంది విద్యార్థులచేత పూర్తిగా అంగీకరించబడిన అద్భుతమయిన కోర్స్

కథ

జగడ

"ఆగు. ముందుకు రాకు. అడుగు ముందుకు వేశావంటే కాళ్లు విరగ్గొడతాను" లక్ష్మి కంఠం వినిపిస్తోంది. కార్తీక మాసపు ప్రాతఃకాల నిద్రాభంగమైంది. రాఘవన్‌కు లేవక తప్పలేదు. చిటపట చినుకుల చల్లటి గాలి వీచే ప్రాతఃకాలంలో వెచ్చగా దుప్పటి కప్పుకుని అనుభవిస్తున్న సుఖాన్ని వదలి లేచాడు రాఘవన్. వాష్‌బేసిన్ దగ్గర ముఖం కడుగుతూ తొంగి చూశాడు.

"ఏడు గంటలైంది. ఇప్పుడేం చేయాలని వచ్చావు? అంట్లు తోముకోవడం కూడా అయిపోయింది. కాఫీ తాగే వేళకొచ్చి ఏం చేస్తావు? వద్దు బాబూ... వద్దు. ఇక నా వల్లకాదు... ఇక నుండి నువ్వు రానక్కర్లేదు" లక్ష్మి కంఠం వినిపిస్తూనే ఉంది.

వరండాలో జగడ నిలబడి ఉంది. పధ్నాలుగు, పదిహేనేళ్ల పిల్ల. ఇళ్లలో పని చేయడానికి వస్తుంది.

"మెల్లగా మాట్లాడకూడదూ!" రాఘవన్ అన్నాడు.

"ఆ...ఆ... మెల్లగా మాట్లాడతాను. మీ అలుసు చూసుకునే కదూ అది ఇలా తయారైంది. దాని ధైర్యం చూడండి. వారంలో నాలుగు రోజులు ఆలస్యంగా వస్తుంది. అన్ని పనులూ నేనే చేసుకోవాల్సి వస్తోంది. మీకేం... కాఫీ తీసుకోండి" టేబుల్ మీద కాఫీ గ్లాసు పెడుతూ అన్నది లక్ష్మి.

రాఘవన్ మాట్లాడకుండా కాఫీ తాగసాగాడు.

"తాగి పేపర్ చదవండి. దానికి తోడు టీవీ ఒకటి కూడా వుంది కదా. వార్తలు చూడండి. నా ఖర్మ! ఈ ఇంట్లో నేనొక పనిమనిషిని. ఇక్కడ పనితో చావాలి. అక్కడ స్కూల్లో పిల్లల్తోనూ కొట్టుకుని చావాలి...." ఇక మాట్లాడలేక పోయింది. రాబోతున్న ఏడుపును బలవంతంగా ఆపుకుంది.

పాపం లక్ష్మి తప్పేం లేదు. పొద్దున ఏడు గంటలకే ఇంటి నుండి బయల్దేరాలి. బస్సు పట్టుకుని స్కూలుకి చేరేటప్పటికి ఎనిమిదిన్నర అవుతుంది.

బయట నిలబడి ఉన్న జగడ లోపలికి వచ్చి గది ఊడుస్తోంది. ఇది రోజూ జరిగే భాగోతమే. ఒక వైపు లక్ష్మి అంటూ ఉంటుంది. మరో వైపు జగడ నిశ్శబ్దంగా పని చేసుకుపోతుంటుంది. కొంతసేపటి తర్వాత కోపగృహం నుండి బయటికి వచ్చి జగడకు కాఫీ ఇస్తుంది. జగడ దాన్ని చూసీ చూడనట్లుంటుంది. మళ్లా చీవాట్లు... "ఆ... ఈ రోషానికేం తక్కువ లేదు. ఏమే! కాఫీ తాగుతావా లేదా"

జగడ మాట్లాడకుండా తాగేస్తుంది.

మళ్లీ చీవాట్లు... "ఆలస్యంగా రా. ముందు కాఫీ తాగు. సిగ్గులేదూ?" ఈ మాటలు వినగానే జగడ కళ్లల్లో నీటి బిందువుల మెరుపు, ఆ అమాయకపు ముఖంపై ఉదాసీనతను నింపేస్తుంది. దాన్ని దాచుకుంటూ మందహాసంతో తాగేస్తుంది.

రెండేళ్లుగా పని చేస్తోంది. రాఘవన్ కూతురు సుందరికన్నా రెండేళ్లు చిన్నది.

సుందరి దోమతెర లోపల సుఖంగా నిద్రపోతోంది.

మధ్య గదిలో ఊడుస్తున్న జగడపై మళ్లా అరవసాగింది లక్ష్మి "వెళ్లు. ఇక నుండి రాకు. వెళ్లిక్కన్నుండి"

అమాయకమైన ముఖం, రాత్రంతా నిద్రలేని కారణంగా ఎర్రబడి ఉబ్బిన కళ్లు, నల్లటి పచ్చటి రంగుల్ని సంతరించుకున్న దంతాలు....

ఇలాంటి పరిస్థితుల్లోనే రాఘవన్ కల్పించుకుంటాడు. ఫలితంగా తను కూడా చీవాట్లు తింటాడు.

జగడ రాఘవన్‌ను చూసింది.

"లక్ష్మీ!" రాఘవన్ పిలిచాడు.

"మీరూరుకోండి. ఇకనుండి ఇవన్నీ సాగవు. చాలిక"

రాఘవన్ జగడను అడిగాడు "జగదా! ఆలస్యం ఎందుకైంది?"

జగడ జవాబివ్వలేదు.

లక్ష్మి ఆక్రోశంగా అందుకుంది "నైట్ షో సినిమాకు వెళ్లి ఉంటుంది. ఏమే! సినిమాకెళ్లావా?"

జగడ కేవలం తలాడించింది. నోరు మాత్రం తెరవలేదు.

లక్ష్మి అన్నది "ఈ వారం లోపే మూడు రోజులు నైట్‌షో కెళ్లింది"

రాఘవన్ అడిగాడు "డబ్బులెక్కడివి?"

"అవ్వ ఇచ్చింది"

"మీ అవ్వను పిల్చుకురా.. చూడండీ! ముసల్ది వస్తే లెక్కచూసి డబ్బులిచ్చి పంపించండి. వెళ్లు.... మీ అవ్వను పిల్చుకురా"

లక్ష్మి తన ఆదేశం వినిపించింది.

జగడ మళ్లీ రాఘవన్‌ను చూసింది. ఆమె జుట్టులో నీటి బిందువులు... పాపం తడుస్తూ వచ్చింది.

చాలా సేపటి వరకు ఆమె చూపులు రాఘవన్ గుండెలో

నాలుగేళ్ల వయస్సున్నప్పడు ఆమె తల్లి చనిపోతే, నాయనమ్మే జగదను, ఆమె అన్నను అనాథలు కాకుండా కాపాడింది. ఆమె ఆఫీసర్లకు మధ్యాహ్నం భోజనం తీసుకెళ్తుంది.

కాలువ దగ్గర గుడిసె. అన్న రిక్షా నడుపుతాడు. నాయనమ్మకు చూపు మందగించింది. ఆమె ఒకరోజు జగదను రాఘవన్ ఇంటికి తీసుకుని వచ్చి, పనిలో పెట్టింది.

జగద పని బాగానే చేసుకునపోయేది. సుందరీ, జగదా ఒకే వయసు వాళ్లు కావడంతో సరదాగా ఆడుతూ, పాడుతూ ఉండేవాళ్లు. కానీ రెండు నెలలుగా పనికి ఆలస్యంగా వస్తోంది.

గుచ్చుకుంటూనే వున్నాయి.

చాలా తెలివైన పిల్ల. ఆదివారం సినిమా చూసేందుకు తప్పకుండా వస్తుంది. చిత్రహార్ కోసం కూడా తయారుగా ఉంటుంది. నటీనటులందరి పేర్లూ, పాటలూ అన్నీ తెలుసు. టీవీ చూసేప్పుడు ఎవరైనా, ఏదైనా తప్పు చెప్తే కొంతసేపటి తర్వాత దాన్ని సరిదిద్దుతూ సరైన సమాచారం అందిస్తుంది... అదీ ఎవరితోనో మాట్లాడుతున్నట్లు.

ఆ విషయ పరిజ్ఞానానికి రాఘవన్‌కు ఆశ్చర్యం కలిగేది. ఇప్పుడర్థమైంది దానికి స్రోతస్సు... వారానికి మూడు సార్లు సినిమా చూడడంలో ఉందని. ఇంత స్మరణశక్తి గల ఈ పిల్ల స్కూలుకు వెళ్లలేకపోయింది.

నాలుగేళ్ల వయస్సున్నప్పుడు ఆమె తల్లి చనిపోతే, నాయనమ్మే జగదను, ఆమె అన్నను అనాథలు కాకుండా కాపాడింది. ఆమె ఆఫీసర్లకు మధ్యాహ్నం భోజనం తీసుకెళ్తుంది.

కాలువ దగ్గర గుడిసె. అన్న రిక్షా నడుపుతాడు. నాయనమ్మకు చూపు మందగించింది. ఆమె ఒకరోజు జగదను రాఘవన్ ఇంటికి తీసుకొచ్చి, పనిలో పెట్టింది.

జగద పని బాగానే చేసుకుపోయేది. సుందరీ, జగదా ఒకే వయసు వాళ్లు కావడంతో సరదాగా ఆడుతూ, పాడుతూ ఉండేవాళ్లు. కానీ రెండు నెలలుగా పనికి ఆలస్యంగా వస్తోంది. ఎన్ని సార్లు చెప్పినా ప్రయోజనం లేకపోయింది. పాపం చిన్నపిల్ల... సెకండ్‌షో చూసి, నిద్రపోయి, పొద్దున త్వరగా ఎలా లేవగలుగుతుంది?

సోమవారం వెళ్లింది. "అన్న పైసలిచ్చాడు"

బుధవారం కూడా సినిమాకెళ్లింది. శనివారం నాయనమ్మ డబ్బులిచ్చింది. ఆమె అమాయకపు ముఖం వడలిన పువ్వులా అయిపోయింది. కారణం నిద్రలేమే కాదు. సినిమా కూడా.

సాయంత్రం ఆరుగంటలకు జగద, వాళ్ల నాయనమ్మ రాగానే లక్ష్మి మాట్లాడడం మొదలుపెట్టింది.

"చూడు పచ్చియమ్మా! పొద్దున ఆరుగంటలకంటే ముందే ఇంటిముందు వూడ్చి, నీళ్లు చల్లి, ముగ్గు పెట్టాలి. అందుకే పనిమనిషిని పెట్టుకోవడం. పనులన్నీ నేనే చేసుకోవడం, డబ్బులు దానికి ఇవ్వడమూనా? ఇక నావల్ల కాదు"

"అమ్మగారూ! పొమ్మంటే ఎక్కడికి పోతుంది? నీ కూతురులాంటిది... చిన్నపిల్ల కదా..." ముసలమ్మ చెప్పింది.

"ఎక్కడికెళ్తుందో నాకేం తెలుసు?"

"చిన్నపిల్ల! నిద్రపోయింది"

"ఎందుకు నిద్రపోదూ. రోజూ నైట్‌షో చూస్తూ ఉంటే?"

మధ్యలో రాఘవన్ కల్పించుకున్నాడు. "ఎందుకమ్మా ఇంత చిన్నపిల్లను రోజూ సినిమాకు పంపుతావు?"

ముసల్ది జవాబివ్వలేదు. తల వంచుకుని నిలబడింది.

"చిన్నపిల్లలకైతే సినిమా చూడాలనే ఉంటుంది. మనం పెద్దవాళ్లం. వాళ్లకు నచ్చజెప్పాలి. మనమే డబ్బులిస్తే ఎలా?" రాఘవన్ ఉపదేశమివ్వసాగాడు.

ఆమె ఏమో చెప్పాలనుకుంది కానీ, ఏమీ మాట్లాడలేదు.

"ఏమవ్వా! ఒక రోజు అన్న డబ్బులిస్తాడు. ఒకరోజు వదిన. నిన్న నువ్వు ఇచ్చావు. ఈ పిల్లనేమి చేయాలనుకుంటున్నావు?" రాఘవన్ అడగగానే ఆమె వెక్కి వెక్కి ఏడవసాగింది.

"చూడవ్వా! ఇలా ఏడిస్తే ఏం ప్రయోజనం లేదు. లెక్కచూసుకుని డబ్బులు తీసుకెళ్లు. నాకవసరంలేదు" లక్ష్మి మొహమాటం లేకుండా చెప్పింది.

ముసలామె ఏడుపు మధ్యలో చెప్పింది "ఏం చెయ్యయంటారమ్మా! మనవడి పెళ్లి చేశాను. గుడిసెలో మధ్య ఒకే ఒక తెర ఉంది. ఇంతవరకూ దీన్తో పాటు అరుగు మీద ఒక చివర పడుకునే దాన్ని. ఈ వానాకాలంలో ఏం చెయ్యను? అందుకే ఇరుగుపొరుగు పిల్లల్తోబాటు టెంటులో సినిమా చూసేందుకు పంపుతాను. ఇంకేం చెయ్యను?"

విని లక్ష్మి నిశ్చేష్టురాలైంది.

ఆ రాత్రి లక్ష్మి రాఘవన్ ఎదపై తలవాల్చి ఏడ్చింది. "జగదా... జగదా..." లక్ష్మి నోటినుండి రాఘవన్ వింటూనే ఉన్నాడు.

"అరే ఏమయింది? నువ్వు రేపు పనిలోకి రమ్మన్నావు కదా జగదను?" రాఘవన్ అడిగాడు.

జగదకు కూడా ఒక రిక్షావాడు భర్తగా వస్తాడు. ఆమె కూడా తన చిన్న మరదలికి సినిమాకెళ్లేందుకు డబ్బులిస్తుంది.

ఈ ఆలోచనతోనే రాఘవన్ నిద్రలోకి జారుకున్నాడు.

మూల కథ : **కశ్యపన్**

అనువాదం : **మనస్విని**



విజ్ఞానం పెరగాలంటే 'దేశాన్నయినా చూడు... లేక కోశాన్నయినా చూడు' అని పెద్దల ఉవాచ. కోశం అంటే పదశోకం. పదాల అర్థాలను వివరించే పుస్తకం. ఈ పదకోశాలనే నిఘంటువులని అంటుంటాం. శాస్త్రసాంకేతిక విజ్ఞానంలో వచ్చిన మార్పులతో కొత్తకొత్త పదకోశాలూ తయారవుతున్నాయి. సాంకేతిక పదాలకు సైతం తెలుగులో కొత్తకొత్త అర్థాలు పుట్టిస్తున్నారు. ఇంటర్నెట్ ఆవిర్భావం తర్వాత దాని వాడుకలో వచ్చిన పదాలు కూడా ఇంగ్లీషు పదాల అర్థాలకు అనుగుణంగా వచ్చినవే. ఇలా వచ్చిన అనేక పదాలను క్రోడీకరించి ఇంటర్నెట్‌లో వాడుకలోకి తెస్తున్నారు. ఈ క్రమంలోనే నిఘంటువులు పుస్తకరూపం నుంచి వెబ్‌సైట్స్ రూపంలోకి మారుతున్నాయి. అలా అనేక వెబ్‌సైట్స్ అందుబాటులో వున్నాయి. ఆంగ్ల ఉచ్చరణతో సహా నేర్చుకొనే విధంగా ఈ సైట్లు రూపొందుతున్నాయి. ఒక్క తెలుగులోనే కాకుండా అన్ని భాషాల్లోనూ ఈ కృషి జరుగుతోంది. అందుకు ఉదాహరణగా వికీపీడియా సోదర సైట్ 'విక్షనరీ' పేర్కొనవచ్చు.

విక్షనరీ వెతుకుదామా!

నిఘంటువు (డిక్షనరీ) అంటే- అక్షర క్రమంలో పదాలు, వాటి అర్థాలు వివరించేది. దీన్నే పదకోశం, వ్యుత్పత్తి కోశం అనికూడా అంటారు. తెలుగు భాషలో చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ రచించిన నిఘంటువు ప్రఖ్యాతిగాంచినది. ఆన్‌లైన్‌లో కూడా ఇది లభ్యమౌతోంది. అలాగే విక్షనరీ, అక్షరమాల, గూగుల్ వంటి మరికొన్ని సైట్లు కూడా అందుబాటులో వున్నాయి.

బ్రౌణ్య నిఘంటువు : బ్రౌణ్య ఆంగ్లం–తెలుగు నిఘంటువు. స్వేచ్ఛవారు దీన్ని యూనికోడ్‌లోకి మార్చిన ఈ సైట్లో లభ్యమయ్యే పద సంపద అంతా ఉచితంగానే అందుబాటులో వుంటుంది. అంతేకాకుండా ఈ నిఘంటువులో లేని కొత్త పదాలకు ప్రతిపాదనలు కూడా తెలియజేయవచ్చు. http://en2te.sourceforge.net/tel-dictionary/

విక్షనరీ : ఎవరైనా పాల్గొనదగిన ఒక స్వేచ్ఛా బహు భాషా పదకోశం. ఇది వికీపీడియా సోదర వెబ్‌సైట్. వికి, డిక్షనరి పదాలను కలయికతో విక్షనరీ అనే పదానికి రూపకల్పన చేశారు. ఇది తెలుగు పదాల వ్యాకరణ, వాడుక, నానార్థ, వ్యతిరేకార్థం తదితర వివరణలతో నిక్షిప్తం చేసే నిఘంటువు. అయితే పుస్తక రూపంలో వుండే నిఘంటువులు మహా అయితే మూడు భాషలలో వుంటాయి. దీనిలో తెలుగు–తెలుగు, ఇంగ్లీషు–తెలుగుతో పాటు ఇతర విక్షనరీలోని సమాన అర్థం గల పదాలకు లింక్స్ వుండటం వలన, ప్రపంచంలోని వికీ భాషలన్నిటిలోనూ సమాన అర్థంగల పదాలను తెలుసుకునే వీలుంది. కనుక బహుభాష నిఘంటువుగా పేర్కొనవచ్చు. తెలుగు వికీపీడియాలో మాదిరిగానే ఇందులోనూ ఎవరైనా తెలుగు పదాలకు పేజీలను కూడా సృష్టించవచ్చు లేదా మార్పులు చేయవచ్చు. జులై 2005లో ప్రారంభమైన తెలుగు విక్షనరీ, 40,916 పదాల పేజీలకు పైగా విస్తరించింది.

కొత్త పదము చేర్చటం : ముందుగా మొదటి పేజీలో మీకు కావలసిన పదం కోసం వెతకండి. ఆ పదం లేకపోతే సృష్టించాలా అన్న మెసేజ్ చూపుతూ... ఆ పదానికి సంబంధించిన పేజీలేవైనా వుంటే వాటిని చూపిస్తుంది. సృష్టించాలా అనే దానిపై నొక్కితే, మీకు ఖాళీ పేజీ కనపడుతుంది. దానిలో మీరు తెలుగు పదం చేర్చాలనుకుంటే {{ subst: కొత్త తెలుగు పదం}}, ఆంగ్ల పదం చేర్చాలనుకుంటే {{subst:కొత్త ఆంగ్ల పదం}} అని రాసి దాచండి, ఆ తరువాత మార్పులు చేయవచ్చు. http://te.wiktionary.org/wiki/

ఆంధ్రభారతి నిఘంటువు : శబ్దరత్నాకరము, బ్రౌణ్య తెలుగు–ఇంగ్లీష్ నిఘంటువు, బ్రౌణ్య ఇంగ్లీష్–తెలుగు నిఘంటువు, ఆధునిక వ్యవహారకోశం (ఇంగ్లీష్–తెలుగు) (బూదరాజు), ఉర్దూ–తెలుగు నిఘంటువు (పతంగే) లను యూనికోడ్తో వెతకవచ్చు.

భాషా సాంకేతికాల పరిశోధన కేంద్రం నిఘంటువు : ఆంగ్లం నుండి తెలుగుకు, కన్నడ మరాఠి మరియు బెంగాలి నుండి హిందీ ఉర్దూకు, ఇతర భారతీయ భాషల నుండి వివిధ భాషలకు తర్జుమా చేయటానికి భాషా సాంకేతికాల పరిశోధన కేంద్రం, ఐఐఐటి, హైదరాబాదు నిఘంటువులను తయారుచేసింది. అయితే ఇవి యూనికోడ్‌కు ముందువి. పాత కోడింగ్ పద్ధతులతో... అంటే ఇంగ్లీషు అక్షరాలతో తెలుగులో రాయాలి)వాడబడినవి.

తెలుగుపదం : కొత్త పదాల సృష్టి, అందుకు కావలసిన సముదాయిక చర్చా వాతావరణాన్ని కల్పించడం తెలుగుపదం.ఆర్గ్ సైటు ప్రధాన లక్ష్యం. కొందరు ఔత్సాహికులు తమ తమ బ్లాగుల్లో, సోషల్ నెట్‌వర్క్ సైట్లలోని సందేశాల్లో ఉపయోగించే వివిధ ఆంగ్ల భాషాపదాలకు తెలుగు పదాలను ఒక దగ్గర క్రోడీకరించడం కూడా ఒక అనుబంధ లక్ష్యం. ఇది నిఘంటువు కాకపోయినా, ఇక్కడున్న తెలుగు పదాల్ని వాడమని మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాం. ఇక్కడ పోగయ్యే పదసంపద అంతా అందరికీ ఉచితంగానే అందుబాటులో ఉంటుంది. సరికొత్త తెలుగుపదాల కొరకు అభ్యర్థనలు, సందేహాలు, ప్రతిపాదనలు చర్చించవచ్చు. తెలుగు పదాలు సృష్టించడానికి ఉపయోగపడే మార్గదర్శకాలు, వనరుల కోసం ఈ సైట్ చూడొచ్చు. http://telugupadam.org

శబ్దకోష్ : ఇంగ్లీష్ నుంచి తెలుగుకి, తెలుగు నుంచి ఇంగ్లీష్‌కి అనువాదం చేసుకొనేందుకు అనువైన నిఘంటువు ఇది. 2003లో ప్రారంభమైన ఈ సైట్‌ను ప్రతిరోజూ వేలాదిమంది ఉపయోగించుకుంటున్నారు. ఈ నిఘంటువుని మెరుగుపరచటానికి ఎవరైనా సహాయ సహకారాలందించవచ్చు. http://www.shabdkosh.com/te/

సాహితీ డాట్ ఆర్గ్ : ఈ వెబ్‌సైటు జూన్ 14 2001న ప్రారంభించబడినది. ఇదొక తెలుగు నిఘంటువుగానే కాక తెలుగు భాషా పురోభివృద్ధికి కృషి చేయాలనే సదుద్దేశంతో ప్రారంభించబడింది. తెలుగు నిఘంటువును, ప్రపంచస్థాయి రచనలను తెలుగులోకి అనువదించుకోవడానికి ఉపయోగించవచ్చు. సాహితి.ఆర్గ్ సైటు ఫోరం ఉపయోగించి పరస్పరం తెలుగులో చర్చించుకోవచ్చు. సరదా కొరకు గ్రీటింగ్స్ పంపుకోవచ్చు. http://sahiti.org/

ఆంగ్ల తెలుగు నిఘంటువు అప్లికేషన్ : ఆన్‌లైన్లో ఏదైనా నిఘంటువును ఉపయోగించుకోవాలంటే ఇంటర్నెట్ కు అనుసంధానమై ఉండాలి. అలా కాకుండా ఎప్పుడైనా ఉపయోగించుకునేలాగా ఒక అప్లికేషన్ అందుబాటులో వుంది. ఒకసారి ఇన్‌స్టాల్ చేసుకుంటే బ్రౌణ్య పదకోశం మీ చేతిలో ఉన్నట్లే. దీనిలోని ప్రత్యేకత ఏమిటంటే... ఏదైనా పదం ఈ పదకోశంలో లేకపోతే మనమే ఈ నిఘంటువులో చేర్చవచ్చు. ఏదైనా పదానికి అర్థం అసంపూర్తిగా ఉంటే దాన్ని సరిచేసి భద్రపరచవచ్చు. ఈ నిఘంటువును మన కంప్యూటర్లో ఇన్‌స్టాల్ చేసుకోవాలంటే మన కంప్యూటర్‌లో అడోబ్ AIR అనే సాఫ్ట్‌వేర్ ఉండాలి. దాన్ని http://get.adobe.com/air/?PID=4172469 నుండి ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత నిఘంటువుకు సంబంధించిన అప్లికేషన్ ను http://www.divshare.com/download/launch/10505063-c92 నుండి డౌన్లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత కంప్యూటర్ డెస్క్‌టాప్ పైన ఒక ఐకాన్ కనిపిస్తుంది. దాన్ని డబుల్ క్లిక్ చేస్తే ఒక బాక్సు స్క్రీన్ పై ప్రత్యక్షమవుతుంది. దీనిలో అర్థం తెలుసుకోవాలనుకున్న ఇంగ్లీషు పదాన్ని సెర్చ్ బాక్స్ లో టైపు చేసి ఎంటర్ నొక్కాలి. అంతే... ఆ ఇంగ్లీషు పదానికి అర్థం తెలిపే తెలుగు పదాలు సెర్చ్ బాక్సు కిందనే వున్న మరో బాక్సులో వస్తాయి. ప్రస్తుతానికి ఈ అప్లికేషన్ ఆంగ్లం నుంచి తెలుగు పదాలకు మాత్రమే అర్థాలు చూపిస్తుంది. అలాగే కొత్త పదాలనూ చేర్చవచ్చు. నిఘంటువులో ఇది వరకే ఉన్న పదం అర్థాన్ని కూడా మార్చవచ్చు. కొత్తకొత్త పదాలను, వాటి అర్థాలను ఇందులో పొందుపరచుకోవచ్చు. ఈ అప్లికేషన్ చాలా ఉపయోగకరంగా వుంటుంది.

- కె.ఎక్స్.రాజు

కొత్త పుస్తకాలు

మానవత్వాన్ని చూపిన 'రాతి కెరటాలు'



ఈ కవితా సంపుటిని డా॥ పట్నం శేషాద్రికి కవి గోపి అంకితమిచ్చారు. ఈ కవితా సంపుటిలో 44 కవితలున్నాయి. వారి కవిత్వం హిందీ, ఇంగ్లీషు, మరాఠీ, గుజరాతీ, ఉర్దూ, కన్నడం, మలయాళం, పంజాబీ, పర్షియన్, సంస్కృతం, నేపాలీ, డోగ్రీ, కొంకణీ లాంటి భాషలోకి అనువాదాలు అయ్యాయి. "జలగీతం" కాలాన్ని నిద్రపోనివ్వను. తంగేడు పూలు, మా వూరు మహాకావ్యం, గోపి నానీలు, ప్రముఖ కవితా సంపుటాలుగా పేర్కొనవచ్చు. ఈ సంపుటిలో కవితలు కొన్నింటిని పరిశీలిద్దాం.

"కలం జేబులో బందీ అయిపోతుంది/ కాళ్లు చెప్పుల్లో దూరి కదలనంటాయి/ మేఘాలను కోల్పోయిన ఆకాశం/ బీడు వారిన పొలంలా అంగలారుస్తుంది (పేజీ 61)

వీరి కవిత్వంలో మట్టి పరిమళాలు.. ఎంతైనా గ్రోలవచ్చు. ఉదాహరణకు (పేజీ 52) "సారాంశం" కవితలో బతకమ్మలు/పొట్టి పూల కుప్పలు కావు/ తంగేడు పూల నుంచి/ రాలేది పసుపే కాదు/ బతుకు రంగుల / పిలుపులూ వున్నాయి/ సంపన్న వాదానికి/ సహజాతాలు అర్థం కావు. ఆంగ్‌సాన్ సూకీ గురించి ఓ కవితలో గోపి ఇలా రాశారు (పేజీ 17) తుపాకుల నీడలో/ నాలుగు గోడల మధ్య/ కాలం ఆగిపోయినా/ నిశ్శబ్దం గడ్డ కట్టినా/ దేహాన్ని మీరినా / దేశం రక్తనాళాలు నిండా/ జ్వలన ప్రవాహాలు కొనసాగాయంటే అది నిజంగా క్షణక్షణ ప్రవర్ధిత విరాట్ చైతన్యమే!

అయితే ఈ సంపుటిలో చాలా చోట్ల ఆంగ్ల పదాలు... (తెలుగులోనే రాశారు కానీ....) సాధారణ పాఠకుడికి (సాధారణ గృహిణి లేదా 10 లోపు చదువుకున్న వారికి) అర్థం కావడం కష్టం కదా!! కవిత్వం కవులే కాదు.. కష్టజీవులూ చదవాలి కదా!! వరల్డ్ ట్రేడ్ సెంటర్, కాలింగ్ బెల్, క్యాన్వాసు, ప్రిజన్, విజన్, గ్యాసు, బెడ్‌షీటు, క్లాస్‌రూం, బ్లాక్‌బోర్డు, ఫ్యాన్, టీచర్, హైవే, షర్ట్, ఫుట్‌పాత్, ట్రాఫిక్, హోర్డింగ్, స్క్రూ డ్రైవర్, పెయింటింగ్, టెలిఫోన్, గ్రామ్‌ఫోన్, ఈసీజీ, చెవి టోన్?/ ఫోన్ డెడ్, బార్లు/ పోస్టుమ్యాన్, నిబ్బు, వెబ్బు, సాఫ్ట్‌వేర్, రేడియేషన్, యాడ్స్, కన్సార్టియం, హాస్పటల్, బెడ్‌రూం, కారుల గ్యాలరీ, సూట్‌కేసు, మాడ్రన్ కిచెన్, ఫ్రిజ్, టైర్లు, ఓపీనియన్స్, చేంజ్, హ్యాపీ మదర్స్ డే.... ఇలా చాలా... పండిత కవులు... ఆచార్యులు... గోపీసారే ఆలోచించాలి.

రాతికెరటాలు-డా॥ఎన్.గోపీ, పేజీలు : 82, వెల : 60/-, ప్రతులకు : ఎన్. అరుణ, 13-1/5బి, శ్రీనివాసపురం, రామంతపూర్, హైదరాబాద్. మరియు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, అబిడ్స్, అన్ని బ్రాంచీలు.

మనసును తాకే కవితలు



వి. సుకుమార్ పిళ్లై, యం.వి. సీతాపతికి కవి ఆశారాజు ఆత్మీయంగా ఈ సంకలనం అంకితం చేశారు. ప్రజాశక్తి, నేటి నిజం, వార్త, నెలవంక నెమలీక, ముంబయి వన్, సూర్య, పినాకిని, విశాలాంధ్ర, కవితా!, హైదరాబాద్ మిర్రర్, సాహిత్య నేత్రం, నవ్య, పత్రిక, ఆంధ్రజ్యోతి, సాక్షి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి లాంటి పత్రికల్లో ప్రచురణైన కవితల సమాహార సంపుటి ఇది. సమావేశాలు, సంబంధాలు, సంఘర్షణ, సన్నివేశాలు, సందర్భాలు.... అను విభాగాలుగా కవితల్ని విభజన చేసి ప్రచురించారు. రెండు వందల పేజీల్లో 77 కవితలున్న ఈ సంపుటిలో ఒక గ్రీకు దేవత, పాషాణం, నువ్వే, మా అమ్మ, ఓటమిని ఒప్పుకోలేను, నెలవంక నీడలు, హార్మోనియం, బేడీలు, తుషారం, చరిత్రలో, నర్తకి, ఘాయల్, కవితలు... ఇతర భాషల్లోకి అనువదించాల్సిన మంచి కవితలు... సీనియర్ కవిగా ఆశారాజుగారు 'దిశ, సారంగి, బద్నాం, పాగల్ షాయర్' లాంటి గొప్ప కవితా సంకలనాలు వెలువరించారు.ఈ సంపుటిలో వెంటాడే వాక్యాలు కొన్నింటిని చూద్దాం.

"నేనొక మజ్నూని/ తుపాన్ను ఎదుర్కొనే/ నిష్క్రమిస్తాను/ ప్రేమించే వాళ్లను కలిసే/ కావ్యాన్ని ముగిస్తాను" (పేజీ 23). జీవితాన్ని ఎగతాళి చేయొద్దు/ నడకలో తడబాటు వుండొద్దు/ మాటల్లో నిరాశ పడొద్దు/ ఒకసారి లేచి నిలబడి చూడు / ఆకాశం అద్భుతమైన పిచ్చుక గూడు! (పేజీ 59). ఈ ఫొటోలోని వాళ్లు/ మనకోసమే/ మరణించి ఉంటారు (పేజీ 77). మరణిస్తూ బతికేది అస్సలు బతుకేకాదు / మరణించినా బతికుండే/ బతుకే గొప్ప బతుకు (పేజీ 87). తుపాను భయపెట్టే వేళలో / ఒంటరిగా ఒక లాంతరు పట్టుకుని / జైత్రయాత్రకు బయలుదేరాను (పేజీ 106). రాలే నెత్తురు చుక్కలు/ వాలే సీతాకోక చిలుకలు / వేళ్లాడే ఉరితాళ్ల మీద / మిణుగుర్లు మెరుస్తున్నాయి. కవిత్వం, అర్ధరాత్రి నిశ్శబ్దంగా కురిసే వర్షం / తుపాకులతో వెండిస్తే / తడి దొరికేది కాదు (పేజీ 136), జైలుగోడలమీద / ఆకాశం కూలుతోంది/ చిన్న రంధ్రం / పెద్ద సముద్రం / యుగాంతమవుతున్నట్లుంది (పేజీ 155). ఇలా ఎన్నో కవితల్లో... మనల్ని వెంటాడే వాక్యాలు, మట్టి పరిమళాలు సుగంధంలా... మనసును తాకుతాయి.

ఇప్పుడు (కవితా సంపుటి), కవి : ఆశారాజు, పేజీలు : 204, వెల : 90/-, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్, ఘరీ పొయిట్రీ సర్కిల్ - 16-2-740/75/40, వి.కె. దొగెనగర్, గడ్డి అన్నారం, హైదరాబాద్ - 500060.

- తంగిరాల చక్రవర్తి



FIXING GLOBAL FINANCE

KAVALJIT SINGH
pages:127, price : 100/-,
for copies :
PRAJASAKTI BOOK HOUSE
M.H.BHAVAN, PLOT NO21/1,
AZAMABAD, NEAR R.T.C
KALYANA MANDAPAM, HYD.

షూలమ్మీతీ...! షూలమ్మీతీ...!

డా॥ కొండెపోగు బి.డేవిడ్ లివింగ్ స్టన్
పేజీలు :64, వెల : 100/-
డా॥కొండెపోగు బి.డేవిడ్ లివింగ్ స్టన్
రాజగృహ, తర్లుపాడు, మార్కాపురం, ప్రకాశం
మరియు
ప్రజాశక్తి, విశాలాంధ్ర, నవోదయ, దిశ పుస్తక కేంద్రాలు.

ఎవరి గోల వారిదే



ఎక్కడైనా బావే కానీ...

ఎక్కడైనా బావే కాని వంగతోట కాడ కాదన్నట్లుగా అమెరికాతో కలిసి ఎన్ని దుర్మార్గాల్లో అయినా భాగస్వాములు కండి, దొరికిందేదైనా ఉంటే మన వాటా మనకు పట్టుకురండి, అంతే కాని అనవసరంగా అమెరికా యుద్ధ విమానాలు కొనొద్దంటున్నారు బ్రిటన్ ఎంపీలు. బ్రిటన్‌లో తలెత్తిన ఆర్థిక సంక్షోభ పర్యవసానమిది. ఒకప్పుడు ప్రపంచంలో అనేక యుద్ధాలు చేసిన రాయల్ నేవీ ఇప్పుడు నీళ్లతో ఆడుకుంటోందట. ఎన్నో ఏళ్ల నుంచి నిర్మాణంలో ఉన్న హెచ్‌ఎంఎస్ క్వీన్ ఎలిజబెత్ యుద్ధ నౌక 2016 నాటికి గాని సిద్ధం కాదట. మరొక నౌక ప్రిన్స్ ఆఫ్ వేల్స్ పూర్తిగా వినియోగం రావటానికి 2031 వరకు ఆగాలట. సిద్ధమైన ఈ నౌకలు ఏడాదిలో రెండు వందల రోజుల కంటే నీళ్లలో ఉండలేవట. ఇలాంటి దండగమారి పనులెందుకు చేస్తున్నారని గత మంగళవారం నాడు బ్రిటన్ పార్లమెంట్ ప్రజాపద్దుల కమిటీ ప్రశ్నించిన నివేదిక వెల్లడైంది. నౌకల నిర్మాణం ఆలస్యమైతే అమెరికా నుంచి కొనుగోలు చేసే యుద్ధ విమానాల ధరలకు కూడా రెక్కలొస్తాయి. అందువలన అసలు కొన్నింటిని ఎందుకు తగ్గించుకోకూడదని ప్రశ్నించారట. దాంతో తమ రక్షణ బడ్జెట్ ప్రమాదంలో పడుతుందని అమెరికన్లు లబలబలాడుతున్నారుట. ఇంతకీ ఎప్పుడో వినియోగంలోకి వచ్చే నౌకలకు అయ్యే ఖర్చెంతో కూడా చెప్పలేకపోతున్నారు ఇదేం పద్ధతని బ్రిటన్ ఎంపీలు గొణుగుతున్నారు. మార్గరెట్ హడ్జ్ అనే లేబర్ పార్టీ మాజీ మంత్రి మాట్లాడుతూ 350 కోట్ల పౌండ్ల అంచనాతో ప్రారంభించిన యుద్ధ నౌకల నిర్మాణానికి ఇప్పటికి 620 కోట్ల పౌండ్లయింది. మొత్తం 1200 కోట్ల పౌండ్లయినా పూర్తవుతాయా అని ఆశ్చర్యపోతున్నదామె. ఈ నౌకల నిర్మాణాన్ని నిలిపివేస్తే అయ్యే ఖర్చు మరింత ఎక్కువ ఉంటుందని ప్రధాని డేవిడ్ కామెరాన్ ప్రకటించి పార్లమెంట్‌ను తప్పుదారి పట్టించాడని ఆమె ఆరోపించారు. మొన్నటిదాకా అధికారంలో ఉండి మీరేం పొడిచారని అధికార పక్షం అనటం మామూలే కదా. ఇప్పటివరకు రాయల్ నేవీ నిర్వహిస్తున్న తప్పిపోయిన నౌకల వెతుకులాట, రక్షణ సేవలను 2015 తరువాత ప్రయివేటీకరించాలని టోరీ సర్కార్ నిర్ణయించింది.

దబ్బూ పోయె, శనీ పట్టె

పెట్టుబడిదారీ విధానం సమాజంలో క్షీణ సంస్కృతిని వ్యాపింప చేయటానికి ఎంతో చురుకుగా పని చేస్తుంది. అమెరికాలో ఇప్పుడు ఇంటర్నెట్(అంతర్జాలం)ను దుర్వినియోగం చేస్తూ 'లెటర్స్' బ్లాగ్‌లను విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. వాటిని చూసిన వారు తమ ఊరూ పేరూ లేకుండా తమ వాంఛలను వ్యక్తం చేయవచ్చు. అవి నిజమైనవైనా కల్పితమైనవైనా మరికొందరు చదివి 'ఆనందం' పొందుతారు. ఇలాంటి వారికి 'స్ట్రిప్ క్లబ్'లు అమెరికా అంతటా అందుబాటులో ఉంటున్నాయి. వంటరిగా ఉంటూ మానసిక వికారాలకు లోనైన వారు, దాంపత్య జీవితంలో సమస్యలు తలెత్తినవారూ ఇలాంటి క్లబ్బులకు వెళ్లి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఇలాంటి క్లబ్బులు గాకపోయినా ఫోన్ స్నేహం పేరుతో మన దేశంలో, హైదరాబాదులో కూడా అనేక మంది తప్పుదారి పడుతున్నారు. ఐదు నుంచి 20 డాలర్ల వరకు అమెరికాలోని స్ట్రిప్ క్లబ్‌లు ప్రవేశ రుసుము వసూలు చేస్తున్నాయి. అసలు కథ అక్కడే ప్రారంభమౌతుంది. ఇటీవల లారీ ఫ్లెయింట్స్ హస్లర్ అనే క్లబ్‌కు గెరార్డ్ వాల్(39) వెళ్లాడు. మూడు వందల డాలర్లు చెల్లించి ఓ డాన్సర్‌తో కలిసి మందుకొట్టాడు. అదెక్కువైతే క్లబ్ ఉద్యోగి వాల్‌ను ఇంటికి చేర్చాడు. తెల్లవారి లేచి చూసుకుంటే అంతకు ముందు రాత్రి మధుర క్షణాలను గుర్తు చేసుకోవటానికి బదులు గుండెలు బాదుకున్నాడు. పర్సులో ఉన్న 80 డాలర్లు కనిపించలేదు, క్లబ్‌లో ఉన్న గంటన్నరకు 21వేల డాలర్లు ఛార్జి చేసినట్లు బిల్లు వచ్చింది. ఇతర ఛార్జీల సంగతి నాకు తెలియదు, నేను వేటికీ అంగీకరించలేదంటూ క్లబ్‌పై కోర్టుకు వెళ్లాడు. నువ్వింకా అదృష్టవంతుడివయ్యా బాబూ మిసౌరీ నుంచి న్యూయార్క్ వచ్చిన ఒక కంపెనీ అధికారి 2005లో ఒక రాత్రి ఉండి 2,41,000 డాలర్ల బిల్లు కట్టాడు అంటూ కోర్టు సిబ్బంది సానుభూతి పలికారట.

ఇదో కొత్త తరహా అక్రమం

అక్రమాలకు పాల్పడాలని తలచుకోవాలేగాని 'ఐడియాలు' బోలెడు. రష్యాలోని అధికార పక్షం యునైటెడ్ రష్యా పార్టీ కొత్త దారులు చూపింది. ఆ దేశపు రష్యా పోస్ట్ శాఖ ద్వారా ఎలాంటి రుసుములు లేకుండా వచ్చే నెలలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో కోసం తన ప్రచార సామగ్రిని ఉచితంగా పంపుతోంది. ప్రధాన ప్రతిపక్షమైన కమ్యూనిస్టుపార్టీ ఈ అక్రమంపై ఫిర్యాదు చేసినా అలాంటిదేమీ లేదంటూ పట్టించుకోవటం లేదు. సమారా అనే చోట ఉన్న పోస్టాఫీసులో ఉన్న ఆ పత్రికను కమ్యూనిస్టు కార్యకర్తలు పట్టుకొని వీడియో తీశారు. తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల రోజు అనే పేరుతో ఉన్న పత్రికను పంపిణీ చేస్తున్నట్లు సిబ్బంది చెప్పారు. ఆ చెప్పినవారు అసలు తమ సిబ్బంది కాదని రష్యా పోస్టు బుకాయిస్తున్నది. రష్యా పోస్టు శాఖ అధికార పక్షానికి ఆల్ రష్యా పీపుల్స్ ఫ్రంట్ పేరుతో ఏర్పడిన సంస్థద్వారా అనుసంధానించబడిందని, ఈసంస్థ ఎన్నికలలో 25 మంది అభ్యర్థులను కూడా నిలిపిందని కమ్యూనిస్టుపార్టీ వెల్లడించిన సమాచారంపై రష్యన్ పోస్టు నోరు మెదపటం లేదు. అక్కడి ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రభుత్వ శాఖలకు ఎన్నికల బృందాలుగా ఏర్పడే స్వేచ్ఛ ఉంది.

-ఎం.కోటేశ్వరరావు

ఓ సాదాసీదా అబ్బాయి. ప్రేమలో పడ్డాడు. కొన్ని కారణాలవల్ల ప్రేమలో ఓడిపోయాడు. బాధలో ఒక పాట పాడాడు. అదీ తంగ్లీష్ (తమిళ్+ఇంగ్లీష్)లో. 'యో బోయిస్ అయామ్ సింగింగ్ ఎ సాంగ్. సూప్ సాంగ్..ఫ్లాప్ సాంగ్. వై దిస్ కొలావరి డి...... వైట్ స్కిన్ను గరలు. గరలు హార్టు బ్లాకు... ఐసు ఐసు మీటు.. మై ఫ్యూచర్ డార్కు... వై దిస్ కొలావరి డి...". అలా సాగిపోతుందీ పాట. ఆ ఫ్లాప్ సాంగే ఇవాళ ఖండాలను దాటుకుని కుర్రకారునేగాక, అమితాబ్ వంటి సెలబ్రిటీలను సైతం ఆకట్టుకుంటోంది. యూ ట్యూబ్, ఫేస్‌బుక్కుల్లో కోలాహలం సృష్టిస్తోంది.

'కొలావరి' కోలాహలం

"వై దిస్ కొలావరి డి...."

ఉత్తమ జాతీయ నటుడు ధనుష్ తాజా తమిళ చిత్రం '3' లోనిదీ సూప్ సాంగ్. సినిమా విడుదలకు ముందే భాషాబేధాల్లేకుండా మారుమోగిపోతోంది. పాట ఇంత హిట్టవ్వాలీ అంటే ట్యూన్ ముఖ్యం. ఆ ఘనతను తొలి చిత్రంతోనే కొట్టేశాడు సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్. పదంటే పది నిముషాల్లో బాణీ కట్టి వినిపించాడు. సందర్భానికి తగ్గట్టుగా బట్లర్ ఇంగ్లీషు, తమిళం కలిపి పాట రాసుకుని వినిపించాడు హీరో ధనుష్. అంతే రచయితతోపాటు గాయకుడు కూడా దొరికిపోయాడు. పాట రికార్డింగూ అయిపోయింది. ప్రపంచ నలుమూలల నుంచి తెప్పించిన సంగీత పరికరాలను ఇందుకు ఉపయోగించారు. విచిత్రంగా ఇదంతా ఇంటర్నెట్‌లో లీకై యువ హృదయాలను కొల్లగొడుతున్న సమయంలో పాటను అధికారికంగా విడుదల చేయాల్సి వచ్చింది. అత్యంత సులభంగా, గుర్తుంచుకోడానికి వీలుగా వుండడంతో అందరి మన్ననలు అందుకుంటోంది. దక్షిణభారత చిత్రసీమలో సూపర్‌స్టార్లుగా పేరుగాంచిన రజనీకాంత్, కమల్‌హాసన్ కుమార్తెలు ఐశ్వర్య ధనుష్, శృతి హాసన్ సినిమా యూనిట్‌లో ప్రధానపాత్రధారులు. ఐశ్వర్య '3' చిత్రాన్ని నిర్దేశిస్తుండగా, శృతి కథానాయిక పాత్ర పోషిస్తోంది.

'కొలావరి' మేనియా మామూలుగా లేదు. యూ ట్యూబ్‌లో అత్యధికంగా సెర్చ్ చేస్తున్న పాట ఇది. కొలావరి బిజినెస్ కూడా తక్కువేం కాదు. అంతర్జాలంలో కొలావరి రీమిక్స్‌లు కూడా వచ్చేశాయి. తమిళనాట ఏకంగా కొలావరి దోసెలే వచ్చేశాయి. మార్కెట్లో కొలావరి టీషర్టులు, కప్పులు కూడా దర్శనమిస్తున్నాయి. జపాన్‌లో ఫిట్‌నెస్ సెంటర్లలో ఈ పాటే వినిపిస్తోంది.

బాలీవుడ్ నటులు అమీర్‌ఖాన్, షారుక్‌ఖాన్, సంజయ్‌దత్ కేవలం పాట మాత్రమే పాడితే ధనుష్ ఓ అడుగు ముందుకు వేసి పాటను రాసి పాడి వినిపించాడన్నమాట. 'అయితే పాటను రాసినప్పుడుగానీ, పాడినప్పుడుగానీ ఇంత పెద్ద విజయం సాధిస్తుందని ఊహించలేదు. పాట హిట్టయ్యేందుకు ఎలాంటి ప్లాన్ కూడా చేయలేదు. అలా జరిగిపోయిందంతే.... కాకపోతే ఇది ఒక సిల్లీ సాంగ్. కాసేపు నవ్వుకోవడానికి మాత్రమే. వినోదం అందించడం నా బాధ్యత. ఈ పాట ఉద్దేశ్యం కూడా అదే" అంటాడు హీరో ధనుష్. బిగ్ బీ అమితాబ్ 'కొలావరి' విని చాలా క్యాచీగా, సహజంగా వుందంటూ ఐశ్వర్యకు, ధనుష్‌కు ట్వీట్ పంపారు.

ఒక ప్రాంతీయ భాషా చిత్రంలోని పాట సరిహద్దులు దాటి దుమ్ము రేపడం కొత్తేమీ కాదు. సంగీత దర్శకులు విద్యాసాగర్ 'అప్పడి పోడు', దేవిశ్రీప్రసాద్ 'రింగ రింగా...' పాటలకు మాస్ వేసిన స్టెప్పులు మర్చిపోతేకదా. స్థానిక నేపథ్యమే జనానికి పాటను దగ్గర చేస్తుంది. శ్రోతలు ఎంతకని పాశ్చాత్య సంగీతం రుచి చూస్తారు. అందుకే మాంచి మాస్ బీట్ దొరికినప్పుడు వదలకుండా ఇలా పట్టేసుకుంటారు. ఇప్పుడు ధనుష్ 'కొలావరి'లాగా. అన్నట్టు ఈ పాటను మరో గాయనితో కూడా పాడించి విడుదల చేశారు.

ఇంతకీ 'వై దిస్ కొలావరి డి' అంటే అర్థం ఏంటో తెలుసా? 'చంపెయ్యాలన్నంత కసి ఎందుకే?!' అని.

- కె.అంజన

అట్టమీది కథ



వాతావరణ మార్పులు ... ఈ పదం వినగానే మనకు పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు, వణికించే చలి గుర్తుకొస్తాయి. ఏడాదంతా కురవని వర్షం ఒకటిరెండు రోజుల్లోనే పడి ఊళ్లకు ఊళ్లను ముంచెత్తిన జీభత్స దృశ్యాలు కళ్లముందు మెదులుతాయి. భయానక వరదలు, సునామీలు, కరువుకాటకాలతో అతలాకుతలమయ్యే జనజీవనం గుర్తుకొస్తుంది. "మొక్కలు నాటండి, పర్యావరణాన్ని కాపాడండి" అంటూ ఊదరగొట్టే ప్రభుత్వ ప్రచారం చెవుల్లో మారుమోగుతుంది. అయితే, ఆ పదానికి మరో కోణం కూడా ఉంది. ఆ కోణంలో అభివృద్ధి చెందిన దేశాల లాభాపేక్షలు కనపడతాయి. ప్రపంచపోలీస్‌గా పెత్తనం సాగిస్తున్న అమెరికా హుంకరింపులు వినపడతాయి. 'ఎవరేమైతే నాకేంటి ...' అనే ఆ దేశపు ఆధిపత్య భావజాలంతో బక్కచిక్కుతున్న బడుగుదేశాల విషాద వదనాలు కనపడతాయి. జూనియర్ భాగస్వామ్య హోదాకోసం ఉవ్విళ్లూరుతూ అమెరికాకు వంతపాడే భారత్ వంటి దేశాల నిష్క్రియా ధోరణి వెక్కిరిస్తుంది. వీటన్నింటిని మించి పర్యావరణం ముసుగులో సాగుతున్న వేలకోట్ల కర్బన్ రేటింగ్ వ్యాపారం ఉంది. ఆ వ్యాపారంలో పైచేయికోసం సాగుతున్న అంతర్జాతీయ పోటీ ఉంది. వాతావరణ మార్పులపై చర్చించడానికి దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జరుగుతున్న ప్రపంచ వాతావరణ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో మానవాళి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న పర్యావరణ రాజకీయాలు మళ్లీ తెరమీదకు వచ్చాయి.

వాతావ'రణం'

- వి.రాజగోపాల్

కాలుష్యం పెరిగిపోతుండటం వాతావరణంపై పెను ప్రభావం చూపుతోంది. వాతావరణ మార్పులపై ఏర్పాటైన ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ (ఐపిసిసి) చేసిన తాజా నిర్ధారణల ప్రకారం 2040 నుండి 2050 సంవత్సరాల నాటికి ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రత మూడు డిగ్రీల సెంటిగ్రేడ్ పైగా పెరుగుతుంది. శతాబ్దాంతానికి ఆరునుండి ఏడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీని ప్రభావం మానవాళిపై తీవ్రంగా పడనుంది. ఉష్ణోగ్రత పెరిగిన ప్రభావం 2030 నాటికే ప్రపంచమానవాళిపై తీవ్రంగా కనపడుతుంది. తుపాన్ల సంఖ్య పెరగనప్పటికీ తీవ్రత పెరుగుతుంది. పెనుతుపాన్ల ప్రభావానికి ప్రపంచవ్యాప్తంగా 136 మిలియన్ ప్రజలు గురవుతారు. భారీ వరదల కారణంగా 66 మిలియన్ల ప్రజానీకం అతలాకుతలమవుతారు. 1970 నాటి తుపాన్ల తీవ్రతతో పోలిస్తే ఇవి రెండున్నర రెట్లు అధిక ప్రభావం చూపుతాయి. అతి తక్కువ రోజుల్లో అత్యధిక వర్షాలు కురిసే దినాల సంఖ్య పెరుగుతుంది. ఫలితంగా ప్రజా జీవితం అస్తవ్యస్తమవుతుంది. 2005 నాటి ముంబాయి వరదలు, 2009లో కృష్ణానదికి పోటెత్తిన వరదల వంటి సంఘటనలు నిత్యకృత్యాలుగా మారతాయి. వాతావరణ మార్పుల ప్రభావం భారతదేశంపైనా భారీగానే పడనుంది. ఉపఖండంలోని దేశాలతో పాటు, చైనా కూడా ప్రకృతి ప్రకోపానికి గురికానుంది. భారీ వర్షాలు, హిమాలయాలు కరిగిపోవడం, ఫలితంగా ముంచుకొచ్చే వరదలు, ఆ తరువాత విరుచుకుపడే కరువులు వంటి ఉత్పాతాలు ఈ దేశాల్లో చోటుచేసుకోనున్నాయి. అక్కడక్కడ సముద్రం ముందుకు చొచ్చుకువచ్చి పరిసరప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం ఉందని ఐపిసిసి హెచ్చరించింది. ఈ వాతావరణ మార్పుల ప్రభావం ఆహారధాన్యాల ఉత్పత్తిపై గణనీయంగా పడనుంది. పర్వత ప్రాంతాల్లో పెద్దఎత్తున భూకోత సంభవించే ప్రమాదమూ ఉంది. క్లుప్తంగా చెప్పుకోవాలంటే వేడిగాలుల ఉధృతి, భారీగా పెరగనున్న ఉష్ణోగ్రతలతో ఈ ప్రకృతి ఉత్పాతం ప్రారంభమవుతుంది. ఆ తరువాత తరచుగా వచ్చే వరదలు, భారీ వర్షపాతాలు మానవాళిని వెంటాడతాయి. అనంతర సంవత్సరాల్లో భారీ తుపాన్లు, హరికేన్లు, టైఫూన్లు చోటుచేసుకుంటాయి. వీటి ప్రభావం ఆ తరువాత సంవత్సరాల తరబడి వెంటాడే తీవ్ర కరువు రూపంలోకి మారుతోంది. అనంతర కాలంలో ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి పడిపోతాయి. చలిగాలులు, మంచుతుపాన్లు సర్వసాధారణమౌతాయి. ఐపిసిసి చేసిన హెచ్చరికల సారాంశమిది. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, ఉన్నతస్థాయి అధికారులు కలిసి ఈ నిర్ధారణ చేశారు. ఈ హెచ్చరికలనే అన్ని దేశాలు పరిగణలోకి తీసుకుంటున్నాయి. అయితే, ఈ స్థాయిలో ముప్పు ఉండదన్న మరో వాదన కూడా వినిపిస్తోంది. కార్పొరేట్ సంస్థల వ్యాపారం కోసమే ఐపిసిసి ఈ తరహా హెచ్చరికలు జారీ చేస్తోందన్న విమర్శలూ వున్నాయి. ఈ తరహా వాదనలు చేస్తున్న వారు చెబుతున్న లెక్కల ప్రకారం 2050 వ సంవత్సరానికి 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత పెరగనుంది. ఏ లెక్కల ప్రకారం చూసినా రాబోయే సంవత్సరాల్లో

ఉష్ణోగ్రత పెరగనుందన్నది ఒక వాస్తవం. మారనున్న ఈ వాతావరణ మార్పుల ప్రభావానికి మానవాళి లోనుకాక తప్పనిస్థితి నెలకొంది.

ఎవరిదీ పాపం!

మానవాళి ముందు నిలిచిన ఈ పెనుసంక్షోభంలో అభివృద్ధిచెందిన దేశాలదే కీలకపాత్ర. వాటిలోనూ అగ్రరాజ్యం అమెరికాదే అగ్రస్థానం. పారిశ్రామిక విప్లవం తరువాత పెద్దఎత్తున శిలాజ ఇంధనాల (బొగ్గు, పెట్రోలియం) వాడుక ఈ దేశాల్లో ప్రారంభమైంది. వీటి నుండి వెలువడే వాయువులు వాతావరణానికి హానికరంగా మారాయి. ఓజోన్ పొర క్షీణించడం మొదలైంది. ఈ దేశాల్లో విచ్చలవిడిగా జరిగిన పారిశ్రామికీకరణ క్రమేణా మానవాళి ఉనికికే ముప్పుగా మారింది. 2007 నాటి లెక్కల ప్రకారం ప్రపంచజనాభాలో కేవలం 4.99 శాతం ఉన్న అమెరికా 19.73 శాతం కర్బన ఉద్గారాలను వాతావరణంలోకి విడుదల చేస్తోంది. అత్యధిక జనాభా ఉన్న (ప్రపంచజనాభాలో 19.91శాతం) ఉన్న చైనా 22.7 శాతం కర్బన ఉద్గారాలను విడుదల చేస్తోంది. ప్రపంచ జనాభాలో 16.99 శాతం జనం ఉన్న భారతదేశం 4.78శాతం కాలుష్య కారకాలను వాతావరణంలోకి వదులుతోంది. తలసరి కాలుష్యలెక్కల ప్రకారం చూస్తే అమెరికా చేస్తున్న హాని ఏమిటో మరింత స్పష్టంగా కనపడుతుంది. 1980 నుండి 2007 మధ్యకాలంలో అమెరికా 1,44,623 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను ఉత్పత్తి చేసింది. దీని తరువాత స్థానంలో యూరోపియన్ యూనియన్ దేశాలున్నాయి. ఇవి 1,15,262 మిలియన్ టన్నుల కాలుష్యకారకాలను ఉత్పత్తి చేశాయి. చైనా 85,897 మిలియన్ టన్నులు, రష్యా 53,092 మిలియన్ టన్నులు, భారతదేశం 21,756 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ లెక్కలు పరిశీలిస్తే ప్రస్తుతం పొంచి ఉన్న ముప్పుకు ఎవరు కారణమో ఇట్టే అర్థమవుతుంది! ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్



వాతావ'రణం'లో మైలురాళ్లు

జూన్ 1988 : మారుతున్న వాతావరణ పరిస్థితులపై టొరంటోలో అంతర్జాతీయ సదస్సు. అణువిస్ఫోటనం తరువాతి స్థానంలో వాతావరణ విపత్తు ఉంటుందని అంచనా. 2005 నాటికి కర్బన ఉద్గారాలను 20శాతం తగ్గించాలని నిర్ణయం.

నవంబర్ 1988: వాతావరణ మార్పులపై ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ (ఐపిసిసి)ఏర్పాటు.

ఆగస్టు 1990: మొదటి నివేదికను సమర్పించిన ఐపిసిసి

జూన్ 1992 : రియోలో ధరిత్రి సదస్సు. వాతావరణ మార్పులకు సంబంధించి ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్‌పై (యుఎన్ఎఫ్‌సిసి)పై 154 దేశాల సంతకాలు. కాలుష్యానికి కారణమైన కర్బన ఉద్గారాలపై బాధ్యతను అంగీకరించిన అభివృద్ధి చెందిన దేశాలు. నియంత్రణలో ఉంచడానికి, 2000 నాటికి 1990 వ సంవత్సరం స్థాయికి తీసుకురావడానికి అంగీకారం.

మార్చి 1995 : యుఎన్ఎఫ్‌సిసిపై సంతకాలు చేసిన దేశాల తొలి సమావేశం. పారిశ్రామిక దేశాల్లో కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్చలు నిర్వహించాలని నిర్ణయం.

జులై 1996 : జెనీవాలో జరిగిన రెండవ సమావేశంలో కాలుష్యకారక ఉద్గారాలను తగ్గించడానికి నిర్దిష్ట లక్ష్యాలతో కూడిన చట్టబద్ధ ఒప్పందానికి అంగీకరించిన అమెరికా. అదే సమయంలో ఉద్గారాల వ్యాపార పథకానికి ప్రతిపాదన.

డిసెంబర్ 1997 : క్యోటోలో జరిగిన ఈ సదస్సులో 150 దేశాలకు పైగా పాల్గొన్నాయి. ఇక్కడి ఒప్పందపత్రం క్యోటో ప్రోటోకాల్‌గా ప్రసిద్ధికెక్కింది. కాలుష్యం పెరిగిపోవడానికి కారణమైన 38 పారిశ్రామిక దేశాలు 1990వ సంవత్సరాన్ని గీటురాయిగా తీసుకుని 2012వ సంవత్సరానికి కాలుష్య కారక వాయువులను 5.2 శాతం తగ్గించడానికి ఈ సమావేశంలో అంగీకరించాయి. కార్బన్ క్రెడిట్ రేటింగ్స్ విధానానికి ఆమోదం లభించింది.

అక్టోబర్ 1999 : కాలుష్యాన్ని తగ్గించేందుకు డెడ్‌లైన్‌లుపెట్టడాన్ని అమెరికా తోసిపుచ్చింది. కెనడా కూడా అదే బాటలో నడిచింది.

మార్చి 2001: అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన జార్జి బుష్ క్యోటో ప్రోటోకాల్ నుండి తమదేశం తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.

జూన్ 2001: అమెరికా మినహాయించి మిగిలిన అన్ని దేశాలు క్యోటో ప్రోటోకాల్‌కు ఆమోదం తెలిపాయి.

ఫిబ్రవరి 16, 2005 : రష్యా కూడా అంగీకరించడంతో క్యోటో ప్రోటోకాల్‌కు అంతర్జాతీయచట్ట హోదా లభించింది.

మే 2005 : క్యోటో ప్రోటోకాల్ రెండవ దశపై (2012 తరువాత) బాన్‌లో చర్చలు ప్రారంభం.

జులై 29 : జి 8 దేశాలు అభివృద్ధి చెందిన దేశాలు 80శాతం అంతకన్నా ఎక్కువగా కాలుష్యకారక వాయువులను వెదజల్లడం 2050 నాటికి తగ్గించుకోవాలని, ప్రపంచ ఉష్ణోగ్రతను 2 డిగ్రీల సెంటిగ్రేడ్‌కన్నా పెంచకుండా చూడాలని కోరాయి.

డిసెంబర్ 2009 : కోపెన్‌హగన్ సదస్సులో ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేకపోయారు. వాతావరణ మార్పులను అరికట్టడానికి అంకితభావంతో కూడిన ప్రపంచ ఒప్పందం ఒక్కటే మార్గమని ఈ సదస్సు పిలుపునిచ్చింది. కాలుష్యకారకాలను వెదజల్లడంలో తన బాధ్యతను గుర్తించడానికి అమెరికా నిరాకరించడమే దీనికి కారణం. ఐక్యరాజ్యసమితి రూపొందించిన ముసాయిదా (యుఎన్ఎఫ్‌సిసి)ని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి అమెరికా ప్రయత్నించింది.

డిసెంబర్ 2010 : కాలుష్యం పెరగడానికి కారణమైన పారిశ్రామిక దేశాలు దానిని నివారించడంలో మాత్రం తమ బాధ్యతలేదని పేర్కొన్నాయి. కాలుష్య నివారణకు అన్ని దేశాలది సమాన బాధ్యతేనని వాదించాయి అభివృద్ధిచెందుతున్న దేశాలను ఈ మేరకు ఒప్పించాయి.

నవంబర్ 2011 : దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి సదస్సు. దీనిలో 194 దేశాలకు పైగా పాల్గొంటున్నాయి. క్యోటో ప్రోటోకాల్ తొలి దశ ముగియనుండటంతో రెండవ దశపై ఒప్పందం కుదుర్చుకోవడం ప్రధాన లక్ష్యం.

(యుఎన్‌ఎఫ్‌సిసి) కూడా ఇదే చెప్పింది.

[illegible] ఇలా!

ఐక్యరాజ్యసమితి తొలి సమావేశాల్లో తమ బాధ్యతను అంగీకరించినట్లే కనిపించిన అభివృద్ధి చెందిన దేశాలు ఆ తరువాత అడ్డం తిరిగాయి. [illegible] పారిశ్రామికీకరణతో సంబంధం లేకుండా కాలుష్యం ప్రపంచానికంతటికి సంబంధించిన సమస్య కాబట్టి దాని నివారణకు అన్ని దేశాలు సమాన బాధ్యత వహించాలన్న వాదనను ముందుకు తీసుకువచ్చాయి. అమెరికా దాని మిత్ర దేశాలు ఈ తరహా వాదనతో కాలుష్య నివారణ చర్యలను అడ్డుకుంటున్నాయి. 1988వ సంవత్సరంలో ఏర్పాటైన ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ (ఐపిసిసి) తొలి సమావేశంలోనే అభివృద్ధి చెందిన దేశాల చారిత్రాత్మక బాధ్యతను గుర్తించింది. 1992లో జరిగిన రియో ధరిత్రీ సదస్సులో అభివృద్ధిచెందిన దేశాలు సైతం తమ బాధ్యతను అంగీకరించాయి. 2000 సంవత్సరానికి 1990 నాటి స్థాయికి కాలుష్యకారణాలను స్థిరీకరించడానికి ఆ దేశాలు ఈ సమావేశంలో మాట ఇచ్చాయి. 1996 జులైలో జెనీవాలో జరిగిన సమావేశంలో నిర్దిష్ట లక్ష్యాలతో కూడిన చట్టబద్ధ ఒప్పందానికి అమెరికా సైతం అంగీకరించింది. అయితే, 1997 డిసెంబర్‌లో జరిగిన క్యోటో సమావేశంలో అమెరికా వైఖరి మారిపోయింది. అమెరికా మిత్రదేశాలు సైతం ఇదే పద్ధతిని అవలంబించాయి. కాలుష్యానికి కారణమైన తన చారిత్రాత్మక బాధ్యతను గుర్తించడానికి నిరాకరించింది. కాలుష్యాన్ని నివారించడానికి నిర్దిష్ట గడువుతో కూడిన చట్టబద్ధ ఒప్పందానికి ససేమిరా అంది. 150 దేశాలకు పైగా పాల్గొన్న క్యోటో సమావేశం కాలుష్య నివారణకు కృషి చేయాల్సిన బాధ్యత అభివృద్ధిచెందిన, పారిశ్రామిక దేశాలదేనని తేల్చిచెప్పింది. అభివృద్ధి చెందిన దేశాల 'చారిత్రాత్మక బాధ్యత'ను నిర్ధారిస్తూ నిర్దిష్ట గడువుతో కూడిన ఒప్పందాన్ని రూపొందించింది. దీనికి చట్టబద్ధత కూడా ఉండాలని పేర్కొంది. ఇన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది కాబట్టే

వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి నిర్వహించే సమావేశాల్లో దీనికి ప్రాధాన్యత లభించింది. 'క్యోటో ప్రోటోకాల్'గా ప్రసిద్ధికెక్కింది. 2012 సంవత్సరాంతానికి ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్‌లోని పారిశ్రామిక (అనెక్స్ -1) దేశాలు తమ కాలుష్యకారకాలను 1990 సంవత్సరంతో పోలిస్తే సగటున 5.2 శాతానికన్నా తక్కువకు తీసుకురావాలన్నది ఈ సమావేశ నిర్ణయం. అయితే, క్యోటో ప్రోటోకాల్‌కు చట్టబద్ధత రావడానికే 8 సంవత్సరాలు పట్టింది. పారిశ్రామిక దేశాలు అడుగడుగునా సృష్టించిన ఆటంకాలే దీనికి కారణం. 2001లో అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన జార్జిబుష్ క్యోటో ప్రోటోకాల్‌పై తమ దేశం సంతకం చేయదని ప్రకటించారు. ఆ ఒప్పందం నుండి తాము వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. దీంతో 2005లో క్యోటో ప్రోటోకాల్‌కు అంతర్జాతీయ చట్టబద్ధత లభించినప్పటికీ ఆచరణలో విలువలేనిదిగా మారింది. అమెరికాను ఒప్పించడానికి ఆ తరువాత చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. 2009లో జరిగిన కోపెన్‌హగన్ సదస్సు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకుండానే ముగిసింది. 2010 డిసెంబర్‌లో జరిగిన కాంకూన్ సదస్సులో అభివృద్ధి చెందుతున్న దేశాలకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పారిశ్రామిక దేశాల ఒత్తిడికి తలొగ్గడం మినహా అభివృద్ధిచెందుతున్న దేశాలకు మరో మార్గం కనిపించలేదు. దీంతో కాలుష్య నివారణకు పారిశ్రామిక దేశాల చారిత్రాత్మక బాధ్యతను రద్దు చేయడానికి ఈ సమావేశంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు అంగీకరించాయి. దానికి బదులుగా అంతర్గతంగా నిర్దిష్ట కాలపరిమితితో కాలుష్యనివారణ చర్యలు చేపడతామని, వీటిని పరిశీలించడానికి థర్డ్‌పార్టీ వెరిఫికేషన్‌కు ఒప్పుకుంటామని అంగీకరించాయి. దీనికి

వ్యవసాయంపై ప్రభావం ఇలా ...!

వరి : భారీ వర్షాలు ఖరీఫ్ సీజన్‌లో పంటను దెబ్బతీస్తాయి. ఉష్ణోగ్రత ప్రభావం రబీ పంటపై పడుతుంది. మొత్తంమీద వరి ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది.

ఆలూ : పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో మూడు నుండి 7శాతం పెరిగే అవకాశం. అయితే, దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో 4 నుండి 16శాతం ఉత్పత్తి తగ్గుతుంది.

సోయాబీన్ : 8నుండి 13శాతం ఉత్పత్తి పెరుగుతుంది.

వేరుశనగ : నీటికొరత లేకుంటే ఉత్పత్తి పెరిగే అవకాశం. నీటికొరత ఏర్పడితే 5 శాతం తగ్గుతుంది.

కొబ్బరి : కేరళలో కొబ్బరి ఉత్పత్తి పెరిగే అవకాశం

యాపిల్ : హిమాచల్ ప్రదేశ్‌లో ప్రస్తుతం కొండ దిగువ ప్రాంతాల్లోనే సాగయ్యే యాపిల్ ఉష్ణోగ్రతలు పెరిగే కొద్ది కొండ పైప్రాంతాలకు చేరుతుంది.

హేచరీస్ : కోళ్ల పరిశ్రమపై ప్రతికూల ప్రభావం. భారీ వర్షాలు, ఎండలు కోళ్ల పరిశ్రమను దెబ్బతీస్తాయి.

చేపలు : చేపల కొరత ఏర్పడుతుంది. మంచినీటి చెరువుల్లో చేపల సంతాన ఉత్పత్తి తగ్గుతుంది. సముద్రాల్లో తీర ప్రాంతాల నుండి లోతుప్రాంతాలకు చేపలు తరలివెళ్తాయి.

పాలు : పాల ఉత్పత్తి తగ్గే అవకాశం

కీటకాలు : కార్బన్‌డైఆక్సైడ్ పెరగడంతో కీటకాలకు లభ్యమయ్యే ఆహారం పెరుగుతుంది. అయితే, వాటి సంతాన ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది.





బదులుగా వంద బిలియన్ డాలర్లతో గ్రీన్ ఫండ్ ఏర్పాటు చేయడానికి పారిశ్రామిక దేశాలు అంగీకరించాయి. 2012 సంవత్సరాంతానికి 30 బిలియన్‌డాలర్లతో ఈ నిధిని ఏర్పాటు చేస్తామని ఆ దేశాలు ప్రకటించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను కాలరాచిన సమావేశంగా కాంకూన్ సమావేశం చరిత్రలో నిలిచిపోయింది. తాజాగా దక్షిణాఫ్రికా డర్బన్‌లో ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్‌లోని 190కిపైగా దేశాలు సమావేశమైనాయి. క్యోటో ప్రోటోకాల్ మొదటిదశ ముగియనుండటంతో రెండవ దశ రూపకల్పనపై ఈ సమావేశంలో దృష్టి సారించనున్నారు. సహజంగానే పారిశ్రామిక దేశాల చారిత్రాత్మక బాధ్యత గురించి ఈ సమావేశంలో చర్చకు రానుంది. అయితే, అమెరికా వైఖరి ఇప్పటికే స్పష్టంకావడంతో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న అమెరికా కాంకూన్ సమావేశంలో నిర్ణయించిన గ్రీన్‌ఫండ్ ఏర్పాటుకు సైతం ప్రస్తుతం చేతులెత్తేస్తోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో పారిశ్రామిక దేశాలకు అవసరమైన వివిధ రకాల సరుకులు,సేవలు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే తయారవుతున్న సంగతి తెలిసిందే. నూరుశాతం పారిశ్రామిక దేశాల కోసం జరుగుతున్న ఈ తరహా ఉత్పత్తుల కారణంగా వెలువడుతున్న కాలుష్యాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల ఖాతాల్లోనే జమచేస్తున్నారు. ఈ పద్ధతి మారాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు కోరుతున్నాయి. ఎవరి అవసరాల కోసమైతే వాటిని తయారుచేస్తున్నారో ఆ దేశాల ఖాతాల్లోనే వాటిని జమచేయాలన్నది ఆ దేశాల వాదన.

కర్బన్ క్రెడిట్ మాయాజాలం !

కాలుష్య నివారణలో చారిత్రాత్మక బాధ్యతను నిరాకరించిన అమెరికా ఒత్తిడితో ప్రవేశపెట్టిన ఈ విధానం పారిశ్రామిక దేశాలకు వరంగా మారింది. దీని ప్రకారం పారిశ్రామిక దేశాల్లోని కంపెనీలు స్వయంగా కాలుష్యనివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం లేదు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆ తరహా చర్యలు చేపడుతున్న సంస్థలు, కంపెనీలకు రేటింగ్ ఇస్తారు. ఆ పాయింట్లను పారిశ్రామిక దేశాల్లోని సంస్థలు కొనుగోలు చేస్తే చాలు. దీనికోసం క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం (సిడిఎం) అనే సంస్థను ఏర్పాటు చేశారు. కర్బన్ రేటింగ్‌ను పరిశీలించడానికి అన్ని దేశాల్లోనూ అనుబంధ సంస్థలు ఏర్పాటయ్యాయి. ఈ సంస్థలు ఆ దేశాల్లోని కంపెనీలు ఇచ్చే నివేదికలను పరిశీలించి, ఆ సంస్థలకు ర్యాంకులు మంజూరు చేస్తారు. వీటిని పారిశ్రామిక దేశాల్లోని సంస్థలు కొనుగోలు చేస్తాయి. ఈ తతంగం ఇప్పుడు పెద్ద కార్పొరేట్ వ్యాపారంగా మారింది. క్షేత్రస్థాయిలో నామమాత్రపు తనిఖీలతో రేటింగ్‌లు ఇస్తుండటంతో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. మరోవైపు వీటిని కొనుగోలు చేస్తున్న పారిశ్రామిక దేశాల్లోని కంపెనీలు తమ సంస్థల్లో కాలుష్యనివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. తాము సహాయం చేస్తున్నాం కాబట్టి కాలుష్యాన్ని అరికట్టే బాధ్యత అభివృద్ధి చెందుతున్న దేశాలదేనని అవి వాదిస్తున్నాయి. వీటికి ఆ దేశాల ప్రభుత్వాలు వంత పాడుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఆనవాళ్లు లేని సంస్థలు సైతం సిడిఎంకు నివేదికలు సమర్పించి, రేటింగ్‌లు సంపాదించి, వాటిని అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముకున్న సంఘటనలు ఇటీవల కాలంలో వెలుగులోకి వచ్చాయి. భారతదేశంలోనే ఈ తరహా అక్రమాలు ఒకటి, రెండు చోటుచేసుకున్నాయి.

భారత్ వైఖరేంటి ...?

అభివృద్ధి చెందుతున్న దేశాలకు అండగా నిలవాల్సిన భారతదేశం ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో దీనికి భిన్నమైన వైఖరి తీసుకుంటోంది. అమెరికాతో అణుఒప్పందం కుదిరిన తరువాత ఈ వ్యవహారశైలి మరింత స్పష్టంగా కనపడుతోంది. కాంకూన్ సమావేశంలో భారతదేశం మరింత క్రియాశీలంగా వ్యవహరించి ఉంటే అభివృద్ధిచెందుతున్న దేశాలకు అంత హాని జరిగేది కాదన్న అభిప్రాయమూ ఉంది. పారిశ్రామిక దేశాల చారిత్రాత్మక బాధ్యతపై పట్టుబడతామని చెబుతున్న భారతదేశం కీలకమైన సమావేశాల్లో దానికి భిన్నంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వున్నాయి. తాజాగా జరుగుతున్న డర్బన్ సమావేశం(నవంబర్28 – డిసెంబర్9)లోనూ భారత్ అనుసరించే వైఖరిపైనే అభివృద్ధిచెందుతున్న దేశాల ప్రయోజనాలు ఇమిడిఉన్నాయి. అయితే, ఈ సమావేశంలోనూ అమెరికాకు వంతపాడే వైఖరినే భారతదేశం అనుసరించే అవకాశం ఉందని పర్యావరణ పరిశీలకులు భావిస్తున్నారు. ఇటీవల న్యూఢిల్లీలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) ఆధ్వర్యంలో జరిగిన దక్షిణ ఆసియాదేశాల పాత్రికేయుల సమావేశంలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది. ఈ విషయమై బంగ్లాదేశ్ నుండి హాజరైన పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు పర్యావరణశాఖ మంత్రి జయంతి నటరాజన్ సమాధానమిస్తూ 'మీరు భారత్‌ను నమ్మాల్సిందే... మరో మార్గం లేదు. మీ దేశంలో మంచి నాయకులున్నారు. వారికి అన్ని విషయాలు తెలుసు' అని జవాబిచ్చారు. నిర్దిష్ట కాలపరిమితో కూడిన చట్టబద్ధ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నామని భారతదేశం ఇప్పటికే ప్రకటించింది. ★

ఎవరిది బాధ్యత

(తలసరి లెక్కలు ... మిలియన్‌టన్నుల్లో)

(1980 నుండి 2007 వరకు)

దేశం	కర్బన ఉద్గారాలు
అమెరికా	1,44,623
యూరోపియన్ యూనియన్	1,15,262
చైనా	85,897
రష్యా	53,092
జపాన్	30,796
జర్మనీ	26,065
ఇండియా	21,756
యుకె	15,374
యుక్రైన్	13,550
కెనడా	13,384
ఇటలీ	11,688
ఫ్రాన్స్	10,767
పోలాండ్	9,984

భారత్ అమెరికా మధ్య పోలిక

(తలసరి లెక్కలు... మిలియన్ టన్నుల్లో)

సంవత్సరం	అమెరికా	భారత్
1990	19.7	0.7
2009	19.3	1.3

(ప్రస్తుత లెక్కల ప్రకారం భారత ఉద్గారాల కన్నా 15 రెట్లు ఎక్కువగా కర్బన ఉద్గారాలను అమెరికా విడుదల చేస్తోంది.)

ఆరు బయట పడుకుని, చీకటి పడిన రాత్రివేళ ఆకాశం వంక చూసిన కొద్దీ నక్షత్రాలు బాగా ప్రకాశించేవీ, సుమారుగా కనపడేవీ, కనీకనపడనట్టుగా ఉండేవీ చాలా కనపడతాయి. అంతేకాదు, అలా కనబడే నక్షత్రాలు ఒకచోట ఎక్కువగా, మరో చోట తక్కువగా క్రమ పద్ధతిలో కాకుండా చెల్లా చెదురుగా ఉంటూ అక్కడక్కడ ఏదో ఆకారాన్ని మనకు స్ఫురింపజేస్తూ ఆసక్తి కలిగిస్తుంటాయి. అందుకే ఎంతసేపు చూసినా అలుపురాదు. ఎన్నో ఏళ్లుగా ఎంతో మంది చూస్తూనే ఉన్నారు, స్ఫూర్తి పొందుతూనే ఉన్నారు. దీని ఆధారంగానే ఎంతో కళాసృష్టి, ఎంతో విజ్ఞాన సంపదా సాధ్యమైంది. అయినా మనిషికి ఆసక్తి తగ్గడం లేదు. ఆకాశ సౌందర్యం పాతబడలేదు. ఈ చుక్కల ఆకాశం ఇలాకాక మన ఇంట్లో పరచిన టైల్స్‌లాగా అంతా క్రమపద్ధతిలో చక్కగా వుందనుకుందాం. అప్పుడు ఎలా ఉంటుంది? నిజంగా బోరు కొడుతుంది. కదా? ఇదే కాదు, మేఘం ఆకారమైనా, సెలయేరు ప్రవాహగతి అయినా ఒక క్రమపద్ధతిలో ఉంటే ఆకర్షణ ఉండదు. వీటన్నింటిలోనూ ఆసక్తి కలిగించే కోణం వైవిధ్యం! అందుకే వైవిధ్యం అనేది సంపద్వంతమైనది అనడం.

నేచర్ ఈజ్ ది టీచర్

ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి – మీ చిన్నప్పుడు ఆడుకున్న ఆటలూ, తిన్న చిరుతిళ్లూ, పొలంలో పండిన పంటలూ, అమ్మ చేసిన వంటకాలూ...! రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, అరకలు, గోధుమలు,వరి...ఇలా చాలా వుండేవి. ఇప్పుడు మనకు చివరి రెండే చిరపరిచితంగా మిగిలిపోయాయి. ఇప్పుడు పాతికేళ్లలోపున్న వారికి మిగతావి అసలు తెలియకపోయినా ఆశ్చర్యం లేదు. అందువల్ల వెన్న వేసుకున్న సజ్జరొట్టె, పెరుగుతో కలిసిన కొర్ర అన్నం గురించి వివరించి ప్రయోజనం ఉండదు.

దేనినైతే కోల్పోతామో అప్పుడే దాని విలువ తెలుస్తుంది. ఆ సందర్భంలోనే దాని గురించిన చర్చ మొదలవుతుంది. సరిగ్గా అటువంటి జాబితాలోకి వస్తుంది 'జీవ వైవిధ్యం' (బయోడైవర్సిటి). నేడు ప్రపంచవ్యాప్తంగా విలువైనదీ, విస్తృతంగా అవసరమైనదీ ఈ జీవ వైవిధ్యమే! మనిషి ఈ భూగోళం మీదకు రాక

ముందు నుంచీ ప్రాణి ప్రపంచం ఉంది. అంటే వృక్ష ప్రపంచం, జంతు ప్రపంచం! ఇది నేడు కొత్తగా తయారవలేదు. ఏమైనా అయి ఉంటే నాశనమై ఉంటుంది తప్ప, మెరుగయింది లేదు. నిజానికి ఈ వృక్ష సంబంధమైన, జంతు సంబంధమైన ప్రపంచం లేకపోతే మనిషి ఉనికే కాదు, మనిషిరాక (పరిణామం) కూడా సాధ్యమై ఉండేది కాదు. ఈ జీవ ప్రపంచం బతికి బట్ట కట్టడానికి అసలు కారణం – అక్కడ సహజంగా ఉండే నేల, నీరు, శీతోష్ణస్థితి వగైరాల సముదాయం, తత్ఫలితంగా తయారైన సానుకూల వాతావరణం! ఇది లేకపోతే జీవ ప్రపంచం మనుగడ కష్టంగా ఉండేది. లేదా క్రమంగా అంతరించిపోయేది. ఈ విషయం గమనిస్తే జీవవైవిధ్యం ఎంత విలువైనదో బోధపడుతుంది. అంతేకాదు ప్రాంతాలను బట్టి ఒకే రకం జీవులలో కొన్ని తేడాలు ఉంటాయి. అంతేకాదు ఒకే ప్రాంతంలో ఉండే ఒకే రకం జీవులలో తేడాలుంటాయి. ఒక్కసారి ఒకే సీజన్లో లభించే మామిడి పళ్ల రకాల గురించి గుర్తుకు తెచ్చుకోండి. ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. ఇలా ప్రాంతాన్ని బట్టి ఆ ప్రాంతపు శీతోష్ణస్థితితో పాటు ఇతర సహజవనరులు, సంప్రదాయాల కారణంగా విలసిల్లే జీవుల వైవిధ్యమే జీవ వైవిధ్యం. ఈ విచ్ఛిన్నమైన వృక్ష, జంతు వైవిధ్యం ఆధారంగానే ప్రపంచంలోని మానవ మనుగడకు మూలమైన వ్యవస్థలు రూపుదిద్దుకున్నాయి. తద్వారా మానవ నాగరికతా, అభివృద్ధీ సాధ్యమైంది. విస్తృతంగా, విలక్షణంగా విలసిల్లే ప్రకృతి కారణంగానే మనిషి సాగుదల, పెరుగుదల సాధ్యమైంది. అయితే ఈ ప్రకృతి సంపదను జాగ్రత్తగానో, అజాగ్రత్తగానో వినియోగించుకుంటున్నాం. కానీ ఎంతో కాలం మనం దాని గురించి పట్టించుకోలేదు.

గత శతాబ్దంలోనే ఈ విషయాల పట్ల మనిషి దృష్టి మళ్లింది. అప్పుడే ఈ వృక్ష ప్రపంచం, జంతు ప్రపంచం ఎంత విస్తృతమైందీ, ఎంత విలక్షణమైనదీ తెలుసుకోవడానికి ప్రయత్నించడం మొదలైంది. ఫలితంగా మంచి ఔషధాలు, మెరుగైన పంటలూ, పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాల గురించి దృష్టి మళ్లింది. ఇది ప్రపంచ ప్రగతికి దారి తీసింది. అలాగే కాలుష్యకారకమైన విధానాలకు కారణమైంది.

ఈనేపథ్యాలో 'జీవ వైవిధ్యం' అనే అధ్యయనం ప్రారంభమవడమే కాక, ప్రభావవంతంగా పరిణమించింది. ఈ భూగోళం మీద 18 లక్షల రకాల తెలిసిన జీవులున్నట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. నిజానికి ఈ 'తెలిసిన ప్రపంచం' నిజమైన ప్రపంచంతో పోలిస్తే చాలా స్వల్పమైనది. ప్రపంచంలో నలుమూలల నుండి నిరంతరం కొత్త మొక్క గురించో, కొత్త జంతువు గురించో సమాచారం వస్తూ వుంటుంది. ప్రపంచంలో అలా కొత్త ప్రాణి ప్రపంచం విస్తృతంగా ఉన్న దేశాలు పదిహేను అని ఒక అంచనా! ఈ పదిహేను దేశాల్లో భారతదేశం ఒకటి! బ్రెజిల్, మలేసియా, ఇండోనేసియా వంటి

ఆగ్నేయాసియా దేశాల్లో భారత దేశం కన్నా ఎక్కువ జీవ వైవిధ్యం ఉంది.

ఈ భూగోళం మొత్తమ్మీద 15 నుండి 200 కోట్ల రకాల జీవరాసులున్నట్లు, అందులో కేవలం 18 లక్షల రకాల గురించే మనకు కొంత తెలిసినట్లు భావిస్తున్నారు. భూగోళాన్ని ఉత్తర, దక్షిణం అని రెండుగా విభజిస్తే ఉత్తరార్ధగోళంలో ఎక్కువ జీవ వైవిధ్యం ఉంది. అభివృద్ధి అంటే సహజ వనరులను అమితంగా ఖర్చు చేయడం కూడా! అలాగే అభివృద్ధి అంటే సహజ వనరులను వినియోగించే సాంకేతిక విజ్ఞానాన్ని ఎక్కువగా వినియోగించడమే! అందువల్ల ధనిక దేశాల, అభివృద్ధి చెందిన దేశాల దృష్టి నేడు పేద దేశాల మీద కాదు. ఎక్కువ జీవ వైవిధ్యం ఉండే దేశాల మీద పడింది. ఈ దృష్టి ఆధారంగానే ప్రపంచ రాజకీయాలు సాగుతుంటాయి. రాజకీయ మిత్రత్వాలు, శతృత్వాలు తయారవుతుంటాయి కూడా! నైసర్గిక పరిస్థితులూ, శీతోష్ణస్థితులను బట్టి స్థానికమైన పరిస్థితులు రూపుదిద్దుకుంటాయి. వీటి ఆధారంగా అక్కడ పెరిగే మొక్కలు, ఆవాసముండే జంతువులు వృద్ధి చెందుతాయి. మన దేశాన్ని స్థూలంగా పది ప్రాంతాలుగా వర్గీకరించవచ్చు. లడక్ వంటి శీతల పర్వతప్రాంతాలు, కాశ్మీరు, హిమాచల్ ప్రదేశ్, అసోం మొదలైన హిమాలయ పర్వత ప్రాంతాలు, లోయలు, హిమాలయ ప్రాంతపు నదులు ప్రవహించే పల్లపు ప్రాంతాలు, గంగా బ్రహ్మపుత్ర మైదానాలు, రాజస్థాన్ థార్ ఎడారి ప్రాంతాలు, తక్కువ వర్షపాతముండే దక్కన్ పీఠభూములు, ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమ కనుమలు, అండమాన్ నికోబార్ దీవులు, తీర ప్రాంతాల్లో వ్యాపించి ఉండే ఇసుక తిన్నెలు, అడవులు, తీర అడవులు గల ప్రాంతాలు ఈ వర్గీకరణలోకి వస్తాయి. ఇది కేవలం స్థూలమైన వర్గీకరణ మాత్రమే! సూక్ష్మంగా పరిశీలిస్తే మరెంతో వైవిధ్యం కనబడుతుంది. అక్కడ విలసిల్లే వైవిధ్యం వేరుగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజల ఆచారాలు, ఆలోచనలు, అలవాట్ల ఆధారంగా కూడా అక్కడ విలసిల్లే వృక్షజాలం, జంతు ప్రపంచం ప్రభావితమౌతుంది. వెరసి ఆ ప్రాంతానికే పరిమితమైన జీవ వైవిధ్యం రూపొందుతుంది. ఇది క్రమంగా ప్రత్యేకమైన, జన్యుపరమైన విశిష్టతగల జన్యుసంపదకు దారి తీస్తుంది. ఉదాహరణకు తిరుమల కొండల్లో ఉండే జీవ వైవిధ్యం గురించి తెలుసుకోవాలంటే అందులో కృషి చేసిన పరిశోధకులను పలకరించాలి!

జీవ వైవిధ్యంలోని సోయగాన్ని పరికించడం కళాత్మక పార్శ్వం కాగా, ... అందుకోవడం మేథోపార్శ్వం! అడవి లోపల, కిలకిలారావాలు ఆస్వాదించినప్పుడు జీవవైవిధ్యంలోని కళాత్మక మాధుర్యం అనుభవమవుతుంది. సాలెపురుగు ఎలా తన గూడు కడుతుందో, చేప ఎలా ఆహారం తీసుకుంటుందో గమనించినప్పుడు ప్రకృతిలో ఉండే నైపుణ్యం, నిగూఢత బోధపడతాయి.

నేచర్ ఈజ్ ది టీచర్!

- డా॥ నాగసూరి వేణుగోపాల్

భారత్ బయో డైవర్సిటీ హాట్‌స్పాట్

మన దేశానికే పరిమితమైన అపురూప వృక్షసంపద, జంతు సంపద విశేషంగా ఉంది. భారత్‌లో 350 రకాల పాలిచ్చే జంతువులున్నాయి. మన దేశం ఈ విషయంలో ప్రపంచంలోనే ఎనిమిదవ స్థానంలో ఉంది. పక్షులు 12వందల రకాలు (ఇందులోనూ ఎనిమిదో స్థానం), సరీసృపాలు 453 రకాలు (ఐదోస్థానం), 45 వేల రకాల మొక్కలు (15వ స్థానం) ఉన్నాయి. మన దేశంలో సహజ సిద్ధంగా పెరిగే వృక్షజాలం, ఆవాసముండే జంతుజాలం జీవవైవిధ్యంలో చాలా కీలకపాత్ర వహిస్తాయి. అంతేకాదు మనం పండించే పంటల్లో కూడా ఎంతో వైవిధ్యం కనపడుతుంది. అలాగే మన పెంపుడు జంతువుల విషయంలో సైతం విశేషమైన వైవిధ్యం కనపడుతోందనే గుర్తింపు ఉంది. మనం సాకే జంతువుల రకాలు పెరిగినా, మనం పండించే పంటల రకాలు ఎక్కువైనా ఉత్పత్తుల్లో విశేషమైన వైవిధ్యం ఉంటుంది. ఫలితంగా మన ఆహారంలో విలక్షణమైన వైవిధ్యం సాధ్యమవుతుంది. అంతకు మించి పంటలలో వైవిధ్యం ఉన్నప్పుడు వంటలలో కూడా వైవిధ్యం తప్పదు.

చేజేతులా చంపేస్తున్నాం

రాయల్ టైగర్, ఒంగోలు పొట్లగిత్త, బట్టతల మేక... ఈ జాబితాలో చాలా ఉన్నాయి. ఇవి ఏమిటో తెల్సా? క్రమంగా అంతరించిపోతున్నవి. ఇవిపోతే ఏమి? అని ఎవరైనా భావించొచ్చు. గృహనిర్మాణాలు మారిపోయాయి. అంతా కాంక్రీటు భవనాలు కావడంతో ఇళ్లలో పిచ్చుకలు ఆవాసం లేకుండా చేశాం. ఎగిరే పిచ్చుకలు గమనించడం వల్ల ఊయలలో పడుకునే పాపకు వినోదంతో పాటు కంటికి, మెడకు మంచి వ్యాయామమని పరిశీలకులు చెబుతారు. అలాగే పొలాన్ని ఆశించే



క్రిములను తినడం ద్వారా పిచ్చుకలు రైతుకు ఆదాయాన్ని కలిగిస్తాయి. పిచ్చుకలు కొంత ధాన్యం తిన్నా, అవి ఆదా చేసే ధాన్యంతో పోలిస్తే చాలా తక్కువ. ఇలా ఎన్నో రకాలుగా మేలు జరుగుతుంది. పక్షి అయినా, పాము అయినా! ఆధునిక పోకడలతో సాగే మానవుడు సహజ సిద్ధమైన మిత్రులను పోగొట్టుకుంటున్నాడు!

జీవ వైవిధ్యం ఎందుకు అంతరిస్తుంది?

సానుకూల పరిస్థితులు లేకపోతే ఏప్రాణి అయినా మనుగడ సాగించలేదు. ఏ ప్రాంతంలోనైనా ప్రత్యేకమైన మొక్కలు, వృక్షాలు, పక్షులు, జంతువులు ఉన్నాయంటే అక్కడ ఉండే పరిస్థితులు ఆధారంగా ఉంటాయి. డైనోసార్ల వంటివి ఎందుకు కనుమరుగయ్యాయంటే అవి బతకలేకపోవడం వల్లే! ప్రకృతి స్థిరంగా ఉన్న పరిస్థితుల్లో మనిషి జోక్యం చేసుకోకపోతే ప్రమాదం ముంచుకురాదు. మార్పు, నాగరికత, ప్రగతి, టెక్నాలజీ, అధిక జనాభా, పరిశ్రమలు... వంటి కారణాలతో మనిషి జోక్యం బాగా పెరుగుతోంది. ఫలితంగా స హజ పరిస్థితులను విశేషంగా ప్రభావితం చేస్తున్నాం. తద్వారా ఆ పరిస్థితులకు అలవాటు పడిన జీవరాశులు ఇబ్బందులకు గురవుతాయి. క్రమంగా అంతరిస్తాయి. అందువల్లనే ప్రకృతితో మనిషి సహజీవనం చేయాలి కానీ, ఎక్కువ జోక్యం చేసుకోకూడదు. ఒకవేళ ఈ జోక్యం అనేది తక్కువ మోతాదులో ఉంటే ప్రకృతి తనకు తానే సర్దుబాటు చేసుకోగలదు.

సహజ వినాశనాలూ... కృత్రిమ వినాశనాలు

గత 50 కోట్ల సంవత్సరాల వ్యవధిలో ఐదుసార్లు గొప్ప వినాశనాలు సంభవించాయి. 448 మిలియన్ సంవత్సరాల క్రితం మొదటిదీ, 365 మిలియన్ సంవత్సరాల క్రితం రెండవదీ, 286 మిలియన్ సంవత్సరాల క్రితం మూడవదీ, నాల్గవది 210 మిలియన్ సంవత్సరాల క్రితం, ఐదవది 66 మిలియన్ సంవత్సరాల క్రితం జరిగాయని ధృవపరిచింది. ప్రతిసారీ అనంతమైన స్థాయిలో ఈ భూమండలం మీద నష్టం జరిగింది. మొదటి నాలుగు వాతావరణంలో వచ్చిన పెను మార్పుల వల్ల ఏర్పడగా, ఐదవది మాత్రం గొప్ప ఉల్కాపాతం కారణంగా సంభవించింది. ఐదవ వినాశనంలో డైనోసార్లు అంతరించాయి. ఇక ఆరవ వినాశనం ఇప్పుడు నడుస్తోంది. అయితే దీనికి కారణం ప్రకృతి కాదు, కేవలం ఆధునిక మానవుడు!

వికాసం



కొందరికి పూలంటే చాలా ఇష్టం. కానీ పెట్టుకోవడానికుండదు. మరికొందరికి అరుదైన పాత పుస్తకాలు చదవాలని ఎంతగానో వుంటుంది. కానీ చదవలేరు. బయట ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా వున్న చోట కొందరు నిలబడలేరు. ఇలా రకరకాల సమస్యలుంటాయి. సమస్యలు వేరైనా కారణం ఒక్కటే. అదే ఎలర్జీ. వినడానికి తమాషాగా అనిపిస్తున్నా వాస్తవం అదే. పూలల్లో పుప్పొడి రేణువులు, పాతపుస్తకాల్లోని డస్టు, రోడ్డుమీది దుమ్ము, ధూళి వారికి సమస్యలు సృష్టిస్తాయి. ఇవేకాదు! తినుబండారాలు కూడా కొందరిలో ఎలర్జీకి కారణమౌతాయి. మరి అందుకు కారణాలేంటి? ఎందుకు వస్తుంది? వంటి వివరాలు తెలుసుకుందాం.

ఎలర్జీ... ఒక మిస్టరీ

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

మనకు సరిపడని వస్తువు పట్ల శరీరం ప్రతిస్పందించడమే ఎలర్జీ. శరీరానికి సరిపడనివి ఎన్నో వుంటాయి. వీటిని శరీరం సులువుగా గ్రహించగల్గుతుంది.

◆ మనుషులందరూ ఒకే విధమైన లక్షణాలు కల్గి ఉన్నప్పటికీ, ఆహార, విహారాల విషయంలో ఒకరితో ఒకరు విభేదిస్తారు.

◆ ఒకరికి హితమయిన పదార్థం వేరొకరికి విషం అవుతుంది. ఎంతోమందికి ఇష్టమైన చేపలు, గుడ్లు కొంతమందికి పడకపోవచ్చు.

◆ శరీరానికి సరిపడని ఆహారపదార్థాల కారణంగా కొందరిలో వాంతులు, వికారం, తల తిప్పడం, దురదలు, దద్దుర్లు మొదలైనవి రావచ్చు.

◆ శరీరానికి సరిపడకపోవడం అనే ఈ లక్షణాన్నే 'ఎలర్జీ' అంటారు.

◆ ఆహార పదార్థాల వల్లనే కాక దుమ్ము, ధూళి పీల్చినప్పుడు, కొన్ని రకాల వాసనలు, మందుల వల్ల, ఇంకా అనేకానేక సందర్భాల్లోనూ ఈ 'ఎలర్జీ' ప్రత్యక్షమవుతుంది.

ఎలర్జీ ఎందుకు వస్తుంది?

◆ శరీరంలో ఏదేని ప్రవేశించినప్పుడు యాంటీ బాడీల ఉత్పత్తిని ప్రేరేపించేవాటిని 'యాంటిజెన్' లేదా 'ఎలర్జిన్' అంటారు.

◆ తొలుత ప్రవేశించిన వస్తువే శరీరంలో మరల ప్రవేశించినప్పుడు దానికీ, ఇంతకుముందు ఏర్పడిన యాంటీ బాడీలకు సంయోగం జరిగి ఒక ప్రతీకార చర్య జరుగుతుంది.

◆ ఈ ప్రతీకార చర్య ఫలితంగా కొన్ని హానికరమైన రసాయన పదార్థాలు విడుదలై ఎలర్జీని కలిగిస్తాయి.

◆ యాంటీజన్ శరీరంలో ప్రవేశించినప్పుడు ప్రత్యేకమైన యాంటీబాడీలు ఉత్పత్తి అవుతాయి.

◆ ఈ యాంటీజన్, యాంటీబాడీల సంయోగం వల్ల 'హిస్టమిన్', 'సీరోటొనిన్' వంటి రసాయన పదార్థాలు విడుదలవుతాయి. వీటి కారణంగానే ఎలర్జీ సంభవిస్తుంది.

◆ ఎలర్జీ కలిగించే పదార్థాలను 'ఎలర్జిన్' అంటారు.

ఎలర్జీ అంతే!

◆ ఎలర్జీ అనేది సాధారణంగా ఒక తాత్కాలిక ప్రతిచర్య. శాశ్వతమైనది కాదు. ఎటువంటి ఔషధాల అవసరం లేకుండానే సామాన్యంగా దానంతటదే తగ్గిపోతుంది.

◆ కొన్ని రకాల అంతర్గత ఎలర్జీలకు మాత్రం ఔషధాలు వాడాల్సి ఉంటుంది. వైద్యుని సహాయం తప్పనిసరి అవుతుంది.

◆ కొంచెం జాగ్రత్తగా గుర్తు తెచ్చుకుంటే ఏఏ కొత్త పదార్థాల వల్ల ఎలర్జీ వచ్చిందో గుర్తుకొస్తుంది. ఆ పదార్థాలను తినకుండా ఉండడం లేదా వాటికి దూరంగా ఉండడం చేస్తే ఎలర్జీ నుండి విముక్తి పొందుతారు.

◆ ఒకప్పుడు వైద్యులు ఎలర్జీ నుండి ఉపశమనానికి మందులు వాడి ప్రయత్నించమని చెప్పేవారు.

◆ ఇప్పుడు వైద్యులు మందులు ఇవ్వడం లేదు. ఎలర్జీ వచ్చిన వ్యక్తి తాగిన నీరు, ధరించిన దుస్తులు, ఉపయోగిస్తున్న వస్తువులు, తిరుగాడుతున్న పరిసారాల గురించి వివరాలు చెప్పమంటున్నారు.

◆ ఎలర్జీ వచ్చిన వ్యక్తి ఒంటికి పడనివేవో నిర్ధారించి వాటికి దూరంగా ఉండమని సలహా ఇస్తున్నారు.

◆ ఎలర్జీ వచ్చినవారికి మందుల వల్ల జరిగే మేలు స్వల్పమని, శరీరతత్వానికి నప్పని వాటి నుండి దూరంగా ఉండడమే దీనికి నివారణ మార్గమని అంటున్నారు.

ఎలర్జీ కారకాలు

◆ చాలామందికి డస్ట్ ఎలర్జీ ఉంటుంది. ఇళ్లల్లో, ఆఫీసు ఫైళ్లలో, పాత పుస్తకాల పైన దుమ్ము పేరుకుని ఉంటుంది.

◆ దుమ్ములో 'డస్ట్ మైట్స్' చేరతాయి. ఈ డస్ట్‌మైట్స్ మనిషి శరీరంలోకి దూరితే మనిషికి తుమ్ములు, దగ్గులు, జ్వరంతో పాటు ఇతర ఎలర్జీ లక్షణాలు వస్తాయి.

◆ ఇటువంటి ప్రమాదం తలెత్తకుండా ఇళ్లను తరచూ తడిగుడ్డతో తుడుచుకుంటూ ఉండాలి.

◆ పువ్వుల పుప్పొడి వల్ల, జంతువుల బొచ్చు వల్ల కూడా ఎలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది.

◆ గిల్టు నగల్లో ఉండే నికెల్ వల్ల కూడా కొందరికి ఎలర్జీ వస్తుంది.

◆ నగరాల్లో ఎగిసిపడే ధూళికణాలు కూడా ఎలర్జీకి కారణాలవుతున్నాయి.

◆ ఎలర్జీ కారణంగా కొన్ని రకాల పూల వాసన వల్ల కొంతమందికి తలనొప్పి వస్తుంది.

◆ ఎలర్జీ కారణంగానే బస్సు ప్రయాణం పడనివారిని మనం చూస్తుంటాం.

◆ ముఖానికి క్రీము రాసుకుంటే కొందరికి ఎలర్జీ కారణంగా ముఖమ్మీద ఎర్రటి చారలు ఏర్పడతాయి.

◆ తల దిండ్లలోనూ, బెడ్డింగులలోనూ నివాసం ఏర్పరచుకునే సూక్ష్మ జీవుల వల్ల చర్మవ్యాధులు, దగ్గు, జలుబు మొదలైనవి వ్యాపిస్తాయని గుర్తుంచుకోవాలి.

రోగ నిర్ధారణ

◆ ఎలర్జీ ఉన్నవారికి సరైన రోగ నిర్ధారణ జరగకపోయినా, సరిగ్గా చికిత్స జరగక పోయినా ప్రమాదమని హెచ్చరిస్తున్నారు ఈ రంగంలోని నిపుణులు.

◆ 1980 దశకంలో బ్రిటన్‌లో ఎలర్జీ వ్యాధి పీడితుల్లో డీసెన్సిటైజేషన్ టెక్నిక్‌ను వైద్యులు వాడి చూశారు. ఎందరో ప్రాణాలు కోల్పోయారు.

◆ తప్పుడు రోగ నిర్ధారణ వల్ల రోగి ప్రాణాలు పోయే ప్రమాదం, ఎలర్జీ వ్యాధి పీడితుల్లో మిగిలిన వ్యాధుల్లో కన్నా చాలా అధికమని బ్రిటన్ నిపుణులు హెచ్చరించారు.

◆ కొందరు డాక్టర్లు అసలు ఎలర్జీ ఎలా వస్తుందో చూద్దామనే ఉత్సుకతో రోగికి, ఆ రోగికి ఎలర్జీ ఎందుకు వస్తుందని ఊహించి చెబుతున్నాడో, ఆ ఎలర్జీ కారకాన్ని చర్మంలోకి ఇంజెక్షన్ ఎక్కిస్తారు. ఇటువంటి పనులు ప్రమాదమని, అటువంటి వైద్యులకు హెచ్చరికలు చేస్తున్నారు బ్రిటన్ వైద్యపరిశోధకులు.

మానసిక ప్రతిస్పందనా?

◆ ప్రస్తుతం ఎలర్జీపై జరుగుతున్న పరిశోధనల్లో దీన్ని ఒక మానసిక ప్రతిస్పందనగా గుర్తించారు.

◆ ఎలర్జీకి గల కారణాలు తెలుసుకుని వారికి తెలియకుండా ఎలర్జీకి కారణమైన వాటిని వంటకాల రూపంలో ఇవ్వడం జరిగింది. ఎవ్వరూ వీటికి ప్రతిస్పందించకపోవడం విశేషం.

◆ ఎలర్జీ కారకాన్ని ఏ రూపంలో తీసుకున్నా ప్రతిస్పందన ఉండాలి. అందువల్ల ఇది ఒక మానసిక ప్రతి స్పందన మాత్రమే అంటున్నారు.

◆ తమకు ఇష్టంలేని వస్తువులు తీసుకుంటే మానసికంగా వ్యతిరేకత కలిగి ఎలర్జీ ఫీలవుతారు. అవే వస్తువులను వారు తెలియకుండా స్వీకరిస్తే ఎటువంటి లక్షణాలూ కన్పించవు.

◆ ఒకదానిని తినడం వల్ల ఎలర్జీ వస్తుందేమోనన్న భయం ఉన్నప్పుడు వాటిని తినడం వల్ల మానసికమైన భావాలకు లోనైనందుకు ఎలర్జీ కనిపిస్తుందనేది ఈ పరిశోధకుల వాదన.

◆ స్వతహాగా ఎలర్జీ లక్షణాలు తమలో ఉన్నప్పటికీ మానసికమైన ఆందోళన వల్ల అవి పైకి స్పష్టమవుతాయని అంటున్నారు.

◆ ఏది ఏమైనా ఇంకా ఎలర్జీ... ఒక మిస్టరీగానే ఉంది. పరిశోధనలు జరుగుతున్నాయి.

✶





ఎక్కడున్నాయో కనిపెట్టండి!?

చిన్నారులూ... కింద ఆంగ్ల అక్షరాల సమూహం ఉంది. అందులో కొన్ని పక్షుల పేర్లు దాగున్నాయి. వాటిని కూడా ఇక్కడ ఇచ్చాం. అవి అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఎలాగైనా ఉండొచ్చు. ఇప్పుడు మీరు వాటిని వెతికి పట్టుకోవాలి.

AUTUMN	CORN	FIELD	GOOD	HAIL
HIDE	HUNT	LOST	NICHOLAS	RAHAB
RIGHT	SEEK	STEAL	WILL	WRONG

F	Q	A	U	T	U	M	N	C	R	K	O
H	I	W	G	G	O	U	C	O	A	C	N
E	U	E	W	O	D	V	M	R	H	S	I
H	A	I	L	O	S	T	W	N	A	E	C
F	L	H	I	D	E	R	J	H	B	E	H
L	B	B	U	U	O	V	H	S	O	K	O
Z	Y	B	F	N	D	S	A	F	T	B	L
S	N	F	G	C	T	H	G	I	R	Y	A
E	C	J	G	E	O	J	T	B	H	L	S
P	B	G	A	O	V	Z	K	K	M	V	Y
C	U	L	P	B	M	S	V	I	P	V	D
U	B	V	T	Y	P	V	U	U	O	E	J

మన నాయకులు

బుజ్జాయిలూ..మన దేశ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న వారు చాలామంది ఉన్నారు. వారిలో కింద ఫొటోల్లోని ముగ్గురు కూడా ఉన్నారు. వీరి పేర్లేంటో చకచకా చెప్పేయండి.



జవాబు: బాల గంగాధర తిలక్, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్ చంద్రబోస్.

బాతు పులుసు

నసీరుద్దీన్ షాను చూడ్డానికి పల్లెటూరి నుండి ఒక వ్యక్తి వచ్చాడు. అతను ఓ బాతును కూడా తెచ్చాడు. అందుకు నసీరుద్దీన్ కృతజ్ఞతలు చెప్పి బాతు కూర వండించి అతనితో బాటు ఆరగించాడు. తర్వాతి రోజు మరో వ్యక్తి వచ్చి "నిన్న మీకు బాతు ఇచ్చినతని స్నేహితుణ్ణి" అని చెప్పాడు. నసీరుద్దీన్ అతనితో మాట్లాడి భోజనం పెట్టి పంపించాడు. అప్పటి నుండి ప్రతి రోజూ ఎవరో ఒకరు వచ్చేవారు. వచ్చిన ప్రతి వ్యక్తి కూడా తాను బాతు ఇచ్చిన వ్యక్తికి స్నేహితుడిననో, దగ్గరి బంధువుననో, దూరపు బంధువుననో చెప్పేవాడు. వచ్చిన వాళ్లందరికీ తన శక్తి కొద్దీ భోజనం పెట్టి మర్యాద చేసేవాడు నసీరుద్దీన్. అలా కొద్ది రోజులకి అతనిల్లు ఓ సత్రంలా మారిపోయింది. చివరికి నసీరుద్దీన్‌కి చిర్రెత్తుకొచ్చింది. ఎప్పటి లాగే ఒక రోజు ఎవరో ఒకతను నసీరుద్దీన్ ఇంటి తలుపు తట్టాడు. చూస్తే కొత్త వ్యక్తి.

అతను నసీరుద్దీన్‌షాతో "నేను మీకు బాతు ఇచ్చిన వ్యక్తి స్నేహితునికి స్నేహితుణ్ణి" అన్నాడు.

"అలాగా! లోపలికి రండి" అన్నాడు నసీరుద్దీన్. ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు.

నసీరుద్దీన్ తన భార్యను "బాతు పులుసు తీసుకురా!" అన్నాడు. వచ్చిన అతిథికి భోజనం చేసేటప్పుడు అది పులుసు కాక వేడినీళ్లలా అనిపించింది. అందుకే "ఇది ఏం పులుసు?" అని అడిగాడు ముఖమంతా గంటు పెట్టుకుని.

"ఇది బాతు పులుసు యొక్క పులుసు యొక్క పులుసు" అన్నాడు నసీరుద్దీన్‌షా.

- మేకల మదన్ మోహన్ రావు

తేడాలు ఏవి?

పిడుగులూ! కింది రెండు బొమ్మలూ ఒకేలా వున్నా, అందులో 8 తేడాలున్నాయి. వాటిని పెన్నుతో గుర్తించండి చూద్దాం. ఎన్ని తేడాలు గుర్తిస్తే మీకు అన్ని మార్కులు వచ్చినట్టు.



దారి ఏది?

హలో...! తిమింగలానికి బాగా ఆకలేస్తోందట. ఆహారమేమో దూరంగా ఉంది. అక్కడికెళ్లాలంటే మధ్యలో గజిబిజి దారులున్నాయి. వాటిలో ఏ దారిగుండా వెళ్తే తిమింగలం త్వరగా ఆహారాన్ని తినొచ్చో చెప్పండి.

చుట్టాలు వచ్చే....



చుట్టాలు వచ్చే - పండుగ తెచ్చే
జేజమ్మ వచ్చే - జామపండు తెచ్చే
నానమ్మ వచ్చే - నారింజ పండు తెచ్చే
మామయ్య వచ్చే - మామిడి పండు తెచ్చే
బాబాయి వచ్చే - బొప్పాయి పండు తెచ్చే
పెద్దమ్మ వచ్చే - పైనాపిల్ తెచ్చే
అమ్మమ్మ వచ్చే - అరటి పండు తెచ్చే
అన్నయ్య వచ్చే - ఆపిల్ పండు తెచ్చే
పండ్లెన్నో వచ్చే - పోషకాలు తెచ్చే
అన్నీ తిని ఆరోగ్యం పొందే

- నండ్రు రంజిత్ కుమార్,
4వ తరగతి, ఎం.పి.పి.స్కూల్,
కొణతాల పల్లి, వీరులపాడు, కృష్ణా.

ఏమేం ఉన్నాయ్?

ఫ్రెండ్స్... ఏంటలా విచిత్రంగా చూస్తున్నారు? ఇదేం జంతువబ్బా? అనా! మీకో చిన్న పరీక్ష. దీన్ని పరిశీలనగా చూసి ఇందులో ఏయే జంతువుల శరీర భాగాలున్నాయో చెప్పాలి. మరి రెడీనా!

మిలటరీ నడక

పిల్లలూ... ఈ వారం ఏ పక్షి గురించి చెప్పకోబోతున్నామో తెలుసా? బెగ్గురు కొంగ. నలుపు, బూడిద రంగులో ఉండే దీని ఎత్తు ఎంతుంటుందో మీరు ఊహించండి. దగ్గర దగ్గర ఒకటిన్నర మీటరు. అమ్మో! ఇంతెత్తా అనుకుంటున్నారు కదూ! దీని ముక్కు పసుపు రంగులో పలకగా ఉంటుంది. సుమారు 30 సెంటీ మీటర్ల పొడవులో మెడ కింది భాగంలో ఎరుపు రంగు సంచిలాంటి భాగం వేలాడుతుంది. ఈ సంచే బెగ్గురు కొంగని గుర్తుపట్టడానికి గుర్తు. ఈ సంచిని చూడగానే అది తినే ఆహారాన్ని అందులో దాచుకుంటుందేమో, తర్వాత నెమరు వేసుకుంటుందేమో అనిపిస్తుంది. కానీ ఈ సంచికీ గొంతు భాగానికి ఏ సంబంధమూ ఉండదు. ఇది నడుస్తుంటే భలే తమాషాగా ఉంటుందిలే. అచ్చంగా మిలటరీ వాళ్లు మార్చ్ ఫాస్ట్ చేస్తున్నట్లుగా కాళ్లను బాగా పైకెత్తుతుంది. ఇది మాంసాహారి. చచ్చిపోయి ఒడ్డుకు కొట్టుకొచ్చే చేపలు, కప్పలు, పాములు, చిన్న చిన్న ఇతర జంతువులు, కొన్ని రకాల కీటకాలను ఆహారంగా తీసుకుంటుంది. గాల్లోకి ఎగిరే ముందు రెక్కలను బలంగా కొట్టుకుంటూ కొంత దూరం ముందుకు పరుగెత్తుతుంది. ఇక ఈ పక్షి విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు చూడాలి. భలే నవ్వొస్తుందిలే. కాళ్లను ముందుకు చాపి కూర్చొని, తలని భుజాల మధ్య పెట్టుకుని చూడ్డానికి ఎంతో విచారంగా ఉన్నట్లు కనిపిస్తుంది. కొండల మీద, ఎత్తైన అడవుల్లో నివసిస్తుంది. ఈ జాతిలోనే మరో పక్షి చిన్న బెగ్గురు కొంగ. దీనికి మెడకింద వేలాడే సంచివంటి నిర్మాణం ఉండదు. శరీరం పైభాగం నల్లగా మెరుస్తుంది.



డి. తేజస్వి,
6వ తరగతి,
అభ్యుదయ హైస్కూల్,
హైదరాబాద్.



మాటల కోట - 79

రూపకల్పన: కొమ్మూలపాటి

	1		2		3			4
5					6	7		
		8		9			10	
11						12		
	13				14			15
16				17			18	
	19		20					
21		22						
23				24		25		

అడ్డం

1. సీసాకు పెట్టే బెండు మూత (3)
3. నింపడమే! (4)
5. తగాదా (2)
6. రౌడీలు నడిపేది. దండ కాదండోయ్! (2)
8. మహిళా సంఘం తొలి తరం నాయకులు 'సూర్యావతి'గారి ఇంటిపేరు (4)
10. రష్యాలో ఈ చక్రవర్తుల పాలనకు చరమగీతం పాడాకే సోషలిస్టు స్థాపన జరిగింది (2)
11. ప్రముఖ బ్యాడ్మింటన్ ఆటగాడు గోపీచంద్ ఇంటిపేరు (3)
12. గుర్రపుశాల (2)
13. 'ప' గుణింతం అక్షరం విడిచి అక్షరం రాయండి (3)
14. రాజుగారి భార్య (2)
16. మంజుల నటించి, నిర్మించిన చిత్రం (1)
17. చక్రాలు తింటుంటే వచ్చే శబ్దం. చివరి రెండక్షరాలు (2)
18. మామయ్య పల్లెటూరి యాసలో ఇలా (2)
20. పాండవులలో మొదటివాడు (4)
21. మచ్చుర్దాన్ (4)
23. బజ్జీలు వేయాలంటే ఈ పిండి కావాల్సిందే (3)
24. ఒక తల్లికి పుట్టిన బిడ్డలు (5)

నిలువు

1. మిగతా నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటినా ఇవి మాత్రం కిలో రూపాయే (2)
2. ఓ రాక్షసి పేరు. 'గీతాంజలి'లో నాగార్జున శ్మశానంలో పాడే పాటలో వస్తుంది (3)
3. పూలమాల (3)
4. మూడు నూరులు (3)
5. చేలో పెరిగే పిచ్చిగడ్డి (3)
8. గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వంలో వెలువడిన కులాంతర ప్రేమకథాచిత్రం (4)
9. దోటి (2)
10. నివాస స్థలం (2)
12. మణికట్టు (2)
14. చక్రవర్తి (3)
15. ఏడు నెలలు (5)
17. ఏదైనా చెడు జరిగినప్పుడు 'అంతా మన ....' అంటుంటారు (2)
19. వంటిమీద నూలుపోగులేని శతకకారుడు (3)
20. భూమి (2)
21. పెనం మీద వేసుకుని తినే అల్పాహారం (2)
22. ఒక జాతి సమూహము (2)
25. పరుగు. కింది నుండి పైకి (3)

మాటలకోట - 78 జవాబు

1 ఇ	ట	2 లీ		3 వా	లి		4 శ్రీ	5 శ్రీ
ను		6 పు	7 నా	ది		8 స		ల
9 ము	10 ర		మం		11 గృ	హ	12 ల	క్ష్మి
	క్త	13 రి		14 మా		15 వా	త	
16 వి	క	వి	17 క		18 వా	సి		19 ఏ
20 పె	న్నీ		21 మా	ణి	క్యం		22 పా	డు
	23 రు	24 మా	ల్			25 పు	నీ	త
26 చా		తృ		27 పా		ర		రా
28 ప	థ	క	ము		29 ప్ర	ము	ఖు	లు

హ్హా... హ్హా...

పట్టుదల

సుభాష్: పట్టుదల వుంటే సాధించలేనిది లేదురా!

సతీష్: అవునా! అయితే ఈ బాటిల్‌లో నీళ్లు కింద పోస్తాను. పట్టుదలతో మళ్లీ వాటిని బాటిల్‌లోకి ఎత్తు!

పుస్తకం



విస్సు: అదేంట్రా ఒకే రకం పుస్తకాలు రెండు కొన్నావెందుకు?

నాగ్: ఈ పుస్తకం చేతిలో వుంటే సగం పరీక్షలు పాసైనట్టే అని రాసుంది. అందుకే రెండు కొన్నాను.

వెజ్ రోజ్



"వావ్! రోజా పూలు ఎంత బావున్నాయో!"

"అవును. చూడ్డానికి చాలా బావున్నాయి"

"చూడ్డానికి కాదండీ. తింటుంటే రుచిగా వున్నాయి"

"తింటుంటేనా...!"

"అవును. తింటుంటేనే... పుల్లగా, తియ్యగా, ఉప్పగా, కారంగా... చాలా బావున్నాయి"

"రోజా పూలల్లో ఇన్ని రుచులా!"

"హా...ఎలాగంటే ఈ రోజాలు బీట్‌రూట్, క్యారెట్, యాపిల్, మామిడి, నిమ్మ, కమలా, బంగాళదుంప, టమోటాలతో చేసినవి. అందుకే అన్ని రుచులొచ్చాయ్! ఏంటలా అపనమ్మకంగా చూస్తున్నారు! చేయడం చాలా సింపుల్. పీల్ చేయండి. రోజాలా చుట్టేయండి. ప్లేట్‌లో పెట్టి మీ చిన్నారులకు అందివ్వండి. పళ్లు, కూరగాయలను దగ్గరకు రానివ్వని పిడుగులు కూడా లొట్టలు వేసుకుంటూ తినేస్తారు. పొటాటో రోజ్‌ని మాత్రం నూనెలో వేయించి ఉప్పూకారం చల్లి... కొద్దిగా కొత్తిమీరతో అలంకరించి ఇవ్వాలి. చదువుతుంటేనే నోరూరిపోతోందా! మరి ఆలస్యమెందుకు!"

ప్రకృతి ప్రసాదించిన
వనమూలికలతో తయారు చేయబడిన
సహజసిద్ధ కేశతైలం!
NuZen™
Inspired by Nature
Herbal Hair Oil
జుట్టు రాలటం ఆగిపోతుంది
చుండ్రు పూర్తిగ తగ్గిపోతుంది
కొత్త జుట్టు రావటానికి దోహదపడుతుంది
పేనుకొరుకుడు తొలగిపోతుంది
జుట్టు నిగనిగలాడుతుంది
వయస్సు నిబంధన లేదు
అరుదైన వనమూలికలతో తయారీ
ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు
Herbal Protein Shampoo
100% AYURVEDIC
Grows New Hair
NuZen GOLD
Herbal Hair Oil
Grows New, Denser, Darker & Stronger Hair Reduces Dandruff
For Men & Women
100ml
100% Ayurvedic
NuZen GOLD Herbal Hair Oil
NuZen Herbal Protein Shampoo
Aloe vera
Helps to Generate NEW Hair
అన్ని ప్రముఖ షాపులలో లభించును
BALAJI GRAND BAZAR
SPAR
Taaza
Hetero
MedPlus
RATNADEEP
foodworld
FOOD BAZAAR
health & glow
more.
Rana Ads